ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

## రిపోర్టర్లు కావలెను
అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.
ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక
సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 4 | సంచిక: 89 | పేజీలు: 6 | వెల: రూ.3/- | ఆదివారం 12 జులై 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

## మేడిగడ్డ గేట్లు ఎత్తే ఉంచాలని
# ఎన్‌డిఎస్‌ఎ ఆదేశాలు
## కాళేశ్వరం నీళ్లు ఎత్తిపోయడం కుదరదు



**గేట్లు మూస్తేనే నీరు ఎత్తి పోయడానికి అవకాశం**
**గేట్లు మూస్తే ప్రాజెక్ట కొట్టుకు పోతుందని హెచ్చరిక**
**ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఈటెల వ్యాఖ్యలు**
**బిఆర్ఎస్ నేతల సూచనలతోనే మాట మార్చిన ఈటెల**
**జలశక్తి మంత్రిత్వ శాఖను కలిసి అనుమతి తెస్తే అభ్యంతరం లేదు**
**ఈటెల, బిఆర్ఎస్ నేతలకే బాధ్యత అప్పగిస్తా: సిఎం రేవంత్**

**హైదరాబాద్, జులై 11 (ప్రభాత ఉదయం)**
కాళేశ్వరం విషయంలో తమ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాన్ని దోషిగా నిలబెట్టాలని బీజేపీ నేతలు కుట్రలు చేస్తున్నారని దుయ్యబట్టారు. మాజీమంత్రి హరీశ్‌రావు సూచనల మేరకే ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడారని ఆరోపించారు. కాళేశ్వరంపై ఎంపీ ఈటల అవాస్తవాలు చెప్పారని ధ్వజమెత్తారు. ఎంపీ ఈటల అంటే తమకు గౌరవమేనని తెలిపారు. ఆ వ్యాఖ్యలతో ఈటల తన గౌరవం పోగొట్టుకున్నారని విమర్శించారు. ప్రజలకు వాస్తవాలు తెలిపేందుకే తాము ప్రయత్నిస్తున్నామని అన్నారు. శనివారం మీడియాతో సీఎం రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, ప్రజలను తపుదోవ పట్టించేలా బిఆర్ఎస్ నేతలు, ఎంపి ఈటెల చేస్తున్న ప్రకటనలు దారుణమని అన్నారు. డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ కూడా మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఎన్‌డిఎస్‌ఎ ఇచ్చిన నివేదిక, ఆదేశాల మేరకు తాము నడుచుకుంటున్నామని స్పష్టం చేశారు. కేంద్రంలో ...మిగతా 2లో

## మా మీద కక్షతో రైతుల నోట్లో
# మట్టి కొట్టకు
## రేవంత్ రెడ్డికి కేటీఆర్ హితవు



**హైదరాబాద్, జులై 11 (ప్రభాత ఉదయం)**
కాళేశ్వరం ప్రాజెక్టుపై రాజకీయ కక్షతో రైతులకు అన్యాయం చేయొద్దని సీఎం రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచించారు. గోదావరిలో నీరు ఉన్నా ఎత్తిపోసే అవకాశాన్ని ప్రభుత్వం వినియోగించుకోవడం లేదని విమర్శించారు. మాపై రాజకీయ కక్షతో కాళేశ్వరాన్ని కూలేశ్వరంగా చూపే కుయత్నాలు చేస్తూ... గోదావరి నీళ్లను ఎత్తిపోయకుండా రైతుల నోట్లో మట్టి కొట్టవద్దని సీఎం రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హితవు పలికారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం తెలంగాణలో ఏర్పడుతున్న కరువు కాలం తెచ్చిన కరువు కాదు అని..ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువు అని ఆరోపించారు. ఒకవైపు నీళ్లు లేక రైతులు ఏడుస్తుంటే ...మిగతా 2లో

## కావాలనే కన్నెపల్లి పంపులు
# తెరవడం లేదు
## ప్రభుత్వంపై హరీష్ రావు ఆరోపణలు



**హైదరాబాద్, జులై 11 (ప్రభాత ఉదయం)**
ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్నది కాలం తెచ్చిన కరువు కాదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కుటిల బుద్ధితో తెచ్చిన కరువు అని మాజీ మంత్రి హరీష్‌రావు ఆరోపించారు. గోదావరి నదిలో కావలసినన్ని నీళ్లు ఉన్నప్పటికీ, కేసీఆర్‌కు ఎక్కడ మంచి పేరు వస్తుందోనన్న ఈర్ష్యతో కన్నెపల్లి పంప్ హౌస్ మోటార్లను ప్రభుత్వం కావాలనే ఆన్ చేయడం లేదని విమర్శించారు. సిద్దిపేట జిల్లా నంగునూర్ మండలం తిమ్మారు పల్లి గ్రామంలో జరిగిన పెద్దమ్మ ...మిగతా 2లో

# మధుర గాయని ఎస్.జానకి గుండెపోటుతో కన్నుమూత

**ఆరు దశాబ్దాల కెరీర్‌లో 48 వేలకు పైగా పాటలు పాడిన గానకోకిల**
**2013లో ప్రకటించిన పద్మభూషణ్‌ను సున్నితంగా తిరస్కరించిన వైనం**
**కొద్ది నెలల క్రితమే ఏకైక కుమారుడిని కోల్పోయిన జానకి**
**భారతీయ సంగీతంలో ఒక శకం ముగిసిందన్న ప్రముఖులు**



**హైదరాబాద్, జులై 11 (ప్రభాత ఉదయం)**
ప్రముఖ గాయని ఎస్.జానకి(88) కన్నుమూశారు. వయోభారంతో ఇబ్బందిపడుతున్న ఈమె మైసూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో శనివారం(జూలై 11) సాయంత్రం గుండెపోటుతో మరణించారు. అమెరికాలో ఉంటున్న కుమారుడు కొన్నాళ్ల క్రితం చనిపోవడంతో మనోవేదనకు గురయ్యారు. ఆ బాధకి తోడు అనారోగ్య సమస్యల కారణంగా ఇప్పుడు తుదిశ్వాస విడిచారు. ఈ క్రమంలోనే సినీ ప్రముఖులు నివాళి అర్పిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా, రేపల్లె సమీపంలోని పల్లపట్ల గ్రామంలో 1938 ఏప్రిల్ 23న జన్మించారు. చిన్నతనం నుంచే ...మిగతా 2లో

# ఫోక్సో కేసు పెట్టారన్న కక్షతో ఆరుగురి దారుణ హత్య



**విచిత్రంగా భార్య ఇద్దరు పిల్లల నరికివేత**
**అనంతరం గ్రామం నుంచి పరార్**
**నిందితుడి కోసం గాలిస్తున్న పోలీసులు**
**సైకోను పట్టుకోవాలంటూ గ్రామస్థుల ఆందోళన**

**షాబాద్, జులై 11 (ప్రభాత ఉదయం)**
రంగారెడ్డి జిల్లా షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దైవాలగూడలో ఆరుగురి దారుణ హత్య ఉదంతం రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించింది. నిందితుడు రాజ్‌కుమార్‌పై గతంలోనే ఫిర్యాదు చేసినా పోలీసులు నిర్లక్ష్యం వహించారని, సరైన చర్యలు తీసుకోకపోవడం వల్లే ఈ ఘోరం జరిగిందంటూ బాలిక తరఫు మృతుల బంధువులు, గ్రామస్థులు షాబాద్ పీఎస్ ఎదుట షాబాద్-కంది రహదారిపై బైఠాయించి భారీ ఆందోళనకు దిగారు. ...మిగతా 2లో

## బుల్లెట్ ట్రైన్ హబ్‌గా తెలంగాణ
**గంటల్లోనే చెన్నై, ముంబై.. తెలంగాణకు మూడు బుల్లెట్ ట్రైన్లు**



అశ్వినీ వైష్ణవ్ కీలక ప్రకటన
హైదరాబాద్ నుంచి విజయవాడకు గంటలో చేరుకోవచ్చన్న రైల్వే మంత్రి
తెలంగాణలో రైల్వే ప్రాజెక్టులు పరుగులు పెడుతున్నాయని వ్యాఖ్య

**హైదరాబాద్, జులై 11 (ప్రభాత ఉదయం)**
దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టనున్న ఏడు బుల్లెట్ రైళ్లలో, ఏకంగా మూడు రూట్లు తెలంగాణకే దక్కడం విశేషమని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ప్రధాని మోదీ ప్రత్యేక శ్రద్ధ వల్లే రాష్ట్రానికి ఈ భారీ ప్రాజెక్టులు వచ్చాయని, రాబోయే రోజుల్లో తెలంగాణ దేశంలోనే ఒక పెద్ద బుల్లెట్ ట్రైన్ హబ్‌గా అవతరించబోతోందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ...మిగతా 2లో

# వియత్నాంలో ఘోర విషాదం
**భారతీయ పర్యాటకుల బోటు బోల్తా, 18 మంది మృతి?.. ప్రమాదంలో తెలుగు రాష్ట్రాలకు చెందిన టూరిస్టులు!**

**న్యూఢిల్లీ, జులై 11 (ప్రభాత ఉదయం)**
వియత్నాంలో భారీ విషాదం జరిగింది. భారత టూరిస్టులు ప్రయాణిస్తున్న బోటు ఒకటి నీట మునిగింది. ఈ ప్రమాదంలో పర్యాటకులు గల్లంతయ్యారు. వియత్నాంలోని ఫు క్వ్యాక్ ద్వీపం సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. ఇందులో తెలుగువారు కూడా ఉన్నారు. ఈ మేరకు వియత్నాం హనోయిలోని భారత రాయబార కార్యాలయం తెలిపింది. ప్రమాదం గురించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉందని ఎక్స్‌లో పోస్టు షేర్ చేసింది. ఈ ప్రమాదంలో ఇప్పటి వరకు 15 మంది చనిపోయినట్లు తెలుస్తోంది. ఇటీవల ఓ మొబైల్ కంపెనీ 250 మందితో కూడిన ఒక బృందాన్ని భారత్ నుంచి వియత్నాం పర్యటనకు తీసుకెళ్లింది. వీళ్లంతా మొబైల్ కంపెనీకి చెందిన డిస్ట్రిబ్యూటర్లుగా తెలుస్తుంది. అయితే ఇందులో 40 మంది తెలంగాణ, 35 మంది ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మొబైల్ డిస్ట్రిబ్యూటర్లు ఉన్నారు. .మిగతా 2లో



## సెమీ కండక్టర్ రంగంలో మరో
# కీలక ముందడుగు
2
**హైదరాబాద్‌లో తొలి సీఎంపీ ప్యాడ్ టెక్నాలజీ హబ్**
**టీ-వర్క్స్‌లో హబ్‌ను ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు**

# మేడిగడ్డ గేట్లు ఎత్తే ఉంచాలని ఎన్‌డిఎస్‌ఎ ఆదేశాలు

మొదటి పేజీ తరువాయి

పలుకుబడి ఉన్న బిజెపి ఎంపిగా ఈటెల రాజేందర్ జలశక్తి మంత్రిత్వ శాఖను కలిసి, ఎన్‌డిఎస్‌ఎ ఆధ్వర్యంలో కాళేశ్వరం నీటిని ఎత్తి పోస్తే తమకు అభ్యంతరం లేదని తేల్చి చెప్పారు. ఎన్‌డిఎస్‌ను కలసి నీటిని ఎత్తి పోసేందుకు అనుమతి తెస్తే అందుకు ప్రభుత్వానికి ఎలాంటి అభ్యంతరం ఉండబోదన్నారు. ఎన్‌డిఎస్‌ఎ ఆదేశాల మేరకు మేడిగడ్డ గేట్లు ఎత్తే ఉంచామని అన్నారు. మేడిగడ్డ గేట్లు మూస్తేనే కన్నెపల్లి వద్ద పంపులు నడపడానికి వీలుంటుంద న్నారు. అలా కాకుండా పారుతున్న నీటని ఎత్తి పోయడం సాధ్యం కాదన్నారు. ఇకపోతే పట్టిసీమ కోసం నీటిని వదులు తున్నామని చేస్తున్న ఆరోపణలపైనా సిఎం మండిపడ్డారు. పోలవరం పూర్తి చేసుకునే వరకు పట్టిసీమను కట్టుకున్న విషయం ఆనాటి మంత్రి హరీష్ రావుకు తెలియదా అన్నారు. కావాలనే బురదజల్లే ప్రయత్నాలు చేయడంపై మండిపడ్డారు. ఇపఠిదున్న పరిస్థితుల్లో నీటిని ఎత్తి ప ఓయడం కుదరదని సిఎం తేల్చారు. ఒకవేళ గేట్లు మూస్తే భద్రాచలం వరకు ముంపు తప్పదని ఎన్‌డిఎస్‌ఎ తెలిపిందని అన్నారు. కేసీఆర్ హయాంలో 2019 జూన్ 21వ తేదీన కాళేశ్వరం ప్రారంభించాక, కేసీఆర్ హయాంలోనే మేడిగడ్డ లోపాలు బయటపడ్డాయని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు ప్రారంభించిన 11 నెలల్లోనే లోపాలు బయటపడ్డాయని చెపఠికొచ్చారు. మేడిగడ్డ బ్యారేజ్ నిర్మాణంలో లోపాలు ఉన్నాయని.. 2020 మే 18వ తేదీన ఈఈ రమణారెడ్డి కేసీఆర్ ప్రభుత్వానికి లేఖ రాశారని ప్రస్తావించారు. లోపాలు సవరించాలని అప్పట్లోనే ఇంజినీర్లు సూచించారని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో నిర్లక్ష్యంతో లోపాలు పెరిగి పెద్దవై బ్యారేజ్ కుప్పకూలిందన్నారు. 2022 జులై 14వ తేదీన వరదలకు కన్నెపల్లి పంప్‌హౌస్ దెబ్బ తిందని చెప్పారు. ఇప్పటికీ కన్నెపల్లి పంప్‌హౌస్ వినియోగంలోకి రాలేదని తెలిపారు. 2023 అక్టోబర్ 21వ తేదీన మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోయిందని ప్రస్తావించారు. మేడిగడ్డ బ్యారేజ్ కుంగుబాటుపై.. కేసీఆర్ సీఎంగా ఉన్నపఠిడే ఎన్డీఎస్ఏ కమిటీ ఏర్పాటు చేసిందని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలు నీటి నిల్వకు అనుకూలం కావని ఎన్డీఎస్ఏ తేల్చిచెప్పిందని అన్నారు. ప్లానింగ్, డిజైనింగ్, నిర్మాణం, నిర్వహణ లోపాలపై.. గతంలోనే ఎన్డీఎస్ఏ కమిటీ నివేదిక ఇచ్చిందని ప్రస్తావించారు. ప్రాథమిక, తుది నివేదికల్లో ఎన్డీఎస్ఏ అదే విషయం చెప్పిందని అన్నారు. లోపాలు సవరించాలని నిపుణులు చెప్పినా ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. మొదట్లోనే స్పందించక పోవడంతో ఈ సమస్య పెద్దది అయిందని చెపఠికొచ్చారు. బీఆర్ఎస్ నేతలు కేసీఆర్, హరీశ్‌రావు తమ ప్రభుత్వంపై పదేపదే అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.





## కావాలనే కన్నెపల్లి పంపులు
# తెరవడం లేదు

మొదటి పేజీ తరువాయి

దేవాలయ ఉత్సవాల్లో హరీష్ రావు పాల్గొని మాట్లాడారు. సిద్దిపేట జిల్లా పెద్దమ్మ తల్లి రేవంత్ రెడ్డికి సద్బుద్ధిని ప్రసాదించాలని కోరుకున్నట్లు వెల్లడించారు. ఎంతటి కరవు వచ్చినా రైతాంగానికి నీరందించేలా కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారని, మోటార్లు ఆన్ చేస్తే రంగనాయక సాగర్ నిండి, సిద్దిపేట నియోజకవర్గంలోని దాదాపు 70 నుంచి 80 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని స్పష్టం చేశారు. కాళేశ్వరంతో ఒక్క ఎకరం కూడా పండలేదని వెల్లడించిన ముఖ్యమంత్రి తిమ్మాయిపల్లి గ్రామానికి వచ్చి ప్రజలతో మాట్లాడితే అర్దమవుతుందని అన్నారు. తిమ్మాయిపల్లిలో తాగునీటి కోసం మహిళలు ఖాళీ బిందెలతో ఎదురుచూసే పరిస్థితి ఉండేదని, కాళేశ్వరం జలాల రాకతో ఈ ప్రాంతం బంగారు పంటలతో కళకళలాడుతోందని సంతోషం వ్యక్తం చేశారు.ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులకు నర్మెట ఫ్యాక్టరీ ద్వారా అద్భుతమైన ఆదాయం లభిస్తోందని తెలిపారు.




## బుల్లెట్ ట్రైన్ హబ్‌గా తెలంగాణ

మొదటి పేజీ తరువాయి

ఈ విప్లవాత్మక ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తే ప్రయాణ సమయాలు ఊహించని విధంగా తగ్గిపోతాయన్నారు. ముఖ్యంగా, హైదరాబాద్ నగరవాసులకు ఈ రైళ్లతో ప్రయాణ కష్టాలు పూర్తిగా తీరిపోనున్నాయి. బుల్లెట్ రైలు ఎక్కితే హైదరాబాద్ నుంచి విజయవాడకు కేవలం ఒక గంట పది నిమిషాల్లోనే చేరుకోవచ్చని రైల్వే మంత్రి వివరించారు. అలాగే వ్యాపార రాజధాని ముంబైకి రెండు గంటల ఇరవై నిమిషాలు, అటు చెన్నై నగరానికి కేవలం రెండు గంటల్లోనే దూసుకుపోవచ్చని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ దేశ రవాణా రంగంలోనే ఒక మైలురాయిగా నిలిచిపోతుందన్నారు. ఇదే గ్యాప్‌లో ఈ ప్రాజెక్టుల క్రెడిట్ కోసం కొందరు పాకులాడుతున్నారంటూ విపక్షాలపై మంత్రి మండిపడ్డారు. దీని పూర్తి క్రెడిట్ ప్రధాని మోదీకే దక్కుతుందని, గత యూపీఏ ప్రభుత్వం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు బడ్జెట్‌లో కేవలం రూ. 800 కోట్లు మాత్రమే ఇస్తే, తమ ప్రభుత్వం ఒక్క తెలంగాణకే ఏకంగా రూ. 5000 కోట్ల రైల్వే నిధులు కేటాయించిందని గుర్తుచేశారు.
ఈ నిధుల వరద వల్లే రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టులు పరుగులు పెడుతున్నాయనిస్పష్టం చేశారు.



## మధుర గాయని ఎస్.జానకి
## గుండెపోటుతో కన్నుమూత

మొదటి పేజీ తరువాయి

సంగీతంపై మక్కువ పెంచుకుని, నాదస్వరం విద్వాంసుడు పైడిస్వామి వద్ద ప్రాథమిక పాఠాలు నేర్చుకున్నారు.
సినీ ప్రస్థానం: 1957లో తమిళ చిత్రం 'విధియిన్ విలయాత్తు' ద్వారా నేపథ్య గాయనిగా ప్రస్థానం ప్రారంభించారు. అదే ఏడాది 'ఎమ్మెల్యే' చిత్రంలో 'నీతియే జయమౌనురా' అనే పాట పాడారు. చిన్న పిల్లల గొంతు నుండి ముసలివారి వరకు ఏ వయసు పాత్రకైనా సరిపోయేలా తన స్వరంలో మార్పులు చేయడం ఆమె ప్రత్యేకత.సంగీత ప్రయాణం: లెజండరీ గాయకుడు ఎస్. పి. బాలసుబ్రహ్మణ్యంతో ఆమె పాడిన యుగళ గీతాలు భారతీయ సంగీత చరిత్రలో మైలురాళ్ళుగా నిలిచాయి. 17 భాషల్లో 50వేలకు పైగా పాటలు పాడారు ఎస్ జానకి.
పురస్కారాలు
జాతీయ అవార్డులు: ఉత్తమ నేపథ్య గాయనిగా 4 సార్లు జాతీయ చలన చిత్ర అవార్డులను అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుండి 12 నంది అవార్డులతో పాటు వివిధ దక్షిణాది రాష్ట్రాల నుండి 30కి పైగా అవార్డులు పొందారు. 1986లో కలైమామణి అవార్డు, 1997లో ఫిలింఫేర్, 2002లో అచీవర్ అవార్డు, 2005లో జేసుదాసు అవార్డులు ఆమెను వరించాయి.
2009లో మైసూర్ విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్ పొందారు. 2015లో సైమా లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు, 2017లో వేటూరి జీవిత సాఫల్య పురస్కారం ఆమెకు లభించాయి. మౌనపోరాటం చిత్రానికి సంగీత దర్శకత్వం వహించారు జానకి.
పద్మభూషణ్ తిరస్కరణ: 2013లో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 'పద్మ భూషణ్' పురస్కారాన్ని, దక్షిణాది కళాకారులకు గుర్తింపు ఆలస్యంగా లభిస్తోందని నిరసిస్తూ ఆమె గౌరవపూర్వకంగా తిరస్కరించారు.

# ఫోక్సో కేసు పెట్టారన్న కక్షతో ఆరుగురి దారుణ హత్య

**ఎఫ్ఐఆర్‌లో నిర్ఘాంతపోయే నిజాలు**

అయితే, ప్రధాన నిందితుడైన రాజ్‌కుమార్‌పై నమోదైన పోక్సో ఎఫ్ఐఆర్ కాపీలోని వివరాలు ఇప్పుడు అందరినీ భయాందోళనలకు గురిచేస్తున్నాయి. గత 6 నెలలుగా రాజ్‌కుమార్ సదరు మైనర్ బాలికను ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. తనతో మాట్లాడాలని, కలవాలంటూ నిరంతరం బలవంతం చేసేవాడని తెలుస్తోంది. శంషాబాద్‌లో కాలేజీకి వెళ్లే సమయంలోనూ రాజ్‌కుమార్ వేధింపులు మితిమీరడంతో, అతడి భయానికి తాళలేక తల్లి ఆ బాలికను కాలేజీకి పంపడం మాన్పించేసింది. ఇటీవల పరీక్షలు ఉండటంతో తప్పనిసరి పరిస్థితుల్లో తల్లి దగ్గరుండి బాలికను పరీక్షా కేంద్రానికి తీసుకెళ్లింది. అయితే, పరీక్ష ముగిసిన వెంటనే బాలికను అందరూ చూస్తుండగానే లాక్కెళ్లేందుకు రాజ్‌కుమార్ ప్రయత్నించాడు. 'గతంలో నీ తండ్రిని ఫుల్లుగా తాగించి హార్ట్ ఎటాక్ అని చెప్పి నమ్మించి చంపినట్లే, మిమ్మల్ని కూడా చంపేస్తా' అంటూ రాజ్‌కుమార్ బాలికను, ఆమె తల్లిని తీవ్రంగా హెచ్చరించాడు. దీంతో ప్రాణభయంతో తమను కాపాడాలంటూ బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

**ఇది వరకే నిందితుడిపై కేసు నమోదు..**

ఉన్మాది రాజ్‌కుమార్‌కు ఈ కేసే మొదటిది కాదని తెలుస్తోంది. గతంలోనూ ఓ భూతగాదా విషయంలో ఇద్దరు వ్యక్తులను తీవ్రంగా కొట్టి, చంపేస్తానని బెదిరించినట్లుగా అతడిపై ఆరోపణలు ఉన్నాయి. ఇంతటి నేర చరిత్ర ఉన్న వ్యక్తిపై, ఓ తల్లి తన కూతురి ప్రాణాలు కాపాడాలని మొరపెట్టుకున్నా పోలీసులు నామమాత్రంగా స్పందించడం వల్లే ఇవాళ ఆరుగురి ప్రాణాలు పోయాయంటూ మృతుల బంధువులు, గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని, నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ షాబాద్ పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించడంతో అక్కడ టెన్షన్ వాతావరణం నెలకొంది.

**రాత్రి 11 గంటల నుంచి హత్యలు షురూ.. భార్య, పిల్లలను కూడా**

ఉన్మాది రాజ్‌కుమార్ కేవలం రెండు గంటల వ్యవధిలో సాగించిన నరమేధం ఒళ్లు గగుర్పొడిచేలా చేసింది. రాత్రి 11 గంటల సమయంలో సదరు మైనర్ బాలిక ఇంటికి వెళ్లిన రాజ్‌కుమార్ ఆమె అమ్మతో పాటు నాయనమ్మ అతి దారుణంగా కత్తితో విచాక్షణారహితంగా దాడి చేసి చంపేశాడు. అనంతరం బాలికను బలవంతంగా కారులో 3 కిలో మీటర్ల దూరంలో ఉన్న దైవాలగూడ చెరువు కట్ట వద్దకు తీసుకెళ్లి అఘాయిత్యానికి పాల్పడి గొంతు కోసి హతమార్చాడు. అంతటితో ఆగకుండా అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో తన ఇంటికి బయలుదేరుతూనే.. దారిలో భార్యకు ఫోన్ చేసి ఒకే ఒక్కసారి పిల్లలను చూస్తానని చెప్పాడు. ఇంట్లోకి వెళ్లడమే ఆలస్యం భార్యపై కత్తితో దాడి చేయగా, ఆమె ప్రాణభయంతో బయటకు పరుగులు తీసినప్పటికీ వదలకుండా ఈడ్చుకుంటూ లోపలికి లాకెళ్లి గొంతు కోసి చంపేశాడు. ఆ తర్వాత నిద్రిస్తున్న తన ఇద్దరు కన్న పిల్లలను సైతం ఏమాత్రం జాలి లేకుండా గొంతు కోసి మట్టుబెట్టాడు. ఇలా కేవలం రెండు గంటల్లో ఆరుగురిని పొట్టనబెట్టుకున్న రాజ్‌కుమార్, వారికి రక్తం ఒడుతున్న కారులోనే అక్కడి నుంచి పరారవుతూ తన తండ్రికి ఫోన్ చేసి 'నేను ఆరుగురిని చంపేశాను' అని చెప్పి ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడు.



## భారత నౌకాదళంలో సరికొత్త యుద్ధనౌక 'మహేంద్రగిరి'

**వైజాగ్, జులై 11 (ప్రభాత ఉదయం)**

భారత నౌకాదళం అమ్ములపొదిలో చేరిన అత్యాధునిక స్వదేశీ యుద్ధనౌక ఐఎన్ఎస్ మహేంద్రగిరి చేరిక దేశ రక్షణ రంగంలో సరికొత్త మైలురాయిగా నిలవనుంది. ప్రాజెక్ట్ 17A సిరీస్‌లో భాగంగా నిర్మించిన ఆరో స్టెల్త్ ఫ్రిగేట్ 'ఐఎన్ఎస్ మహేంద్రగిరి'ని నిర్మించారు. ఈ ఆరో అధునాతన స్టెల్త్ ఫ్రిగేట్‌ను ఇండియన్ నేవీకి చెందిన వార్‌షిప్ డిజైన్ బ్యూరో రూపొందించగా మజ్‌గాన్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్ నిర్మించింది. ఇందులో 75 శాతానికి పైగా స్వదేశీ పరికరాలనే ఉపయోగించారు. శత్రువుల రాడార్ల కంటికి చిక్కకుండా తప్పించుకునే స్టెల్త్ ఫీచర్లు, హై-డిగ్రీ ఆటోమేషన్, గాలిలో, నీటిపై, నీటి లోపల అన్ని కోణాల్లో దాడులు చేయగల స్వదేశీ ఆయుధాలు, సెన్సార్స్, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ సిస్టమ్స్ ఈ నౌక ప్రత్యేకతలు. మహేంద్రగిరి కమీషనింగ్ నేపథ్యంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ నౌకాదళ సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. దేశానికి చెందిన 90 శాతానికి పైగా వాణిజ్యం సముద్రం ద్వారానే జరుగుతోందని, అందుకే దేశ ఆర్థిక వృద్ధికి, ఇంధన భద్రతకు సముద్ర రక్షణ అత్యంత కీలకమని చెప్పారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా యుద్ధ నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు.

# మా మీద కక్షతో రైతుల నోట్లో మట్టి కొట్టకు

మొదటి పేజీ తరువాయి

రేవంత్ రెడ్డి ఏమో గోదావరిలో నీళ్లున్నా మా మీద కోపంతో నీళ్లు ఉన్నా కూడా ఇవ్వడం లేదని విమర్శించారు. ఎల్ నినో ప్రభావం వల్ల ఎక్కడా నీళ్లు లేకపోయినా కన్నెపల్లిలో మాత్రం నీళ్లు ఉన్నాయని, 2022 వరదల ఫోటోలు చూపి కన్నెపల్లి మునిగిందని అడ్డమైన మాటలు మాట్లాడుతున్నారని తప్పుబట్టారు.

**నీటి నిల్వ చేయకుండానే ఎత్తిపోయవచ్చు...**

మేడిగడ్డను ముట్టకుండా కన్నెపల్లి నుండి అన్నారం, సుందిళ్ల, ఎల్లంపల్లి, మిడ్ మానేరు అన్ని జలాశయాలు నింపొచ్చు అని, రిటైర్డ్ ఇంజనీర్ల నివేదిక చూసి అయినా రేవంత్ రెడ్డి సోయి తెచ్చుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. మేడిగడ్డ గేట్లు మూసివేయకుండానే కన్నెపల్లి పంప్ హౌస్ నుండి నీళ్లు లిఫ్ట్ చేయవచ్చు అని రిటైర్డ్ ఇంజనీర్ల ఫోరం ప్రభుత్వానికి లేఖ రాసిందని గుర్తు చేశారు. కన్నెపల్లి వద్ద ప్రస్తుతం 96.79 మీటర్ల నీళ్లు ప్రవహిస్తున్నాయి, కానీ 94 మీటర్లకే పంపులు ఆన్ చేయవచ్చు అని, మరో 100 రోజులు కన్నెపల్లి వద్ద ఇదే తరహా ప్రవాహం ఉంటుందన్నారు. 100 రోజుల్లో రోజుకి 2 టీఎంసీల చొప్పున 200 టీఎంసీల లిఫ్ట్ చేస్తే, గోదావరి బేసిన్లో ఉన్న అన్ని రిజర్వాయర్లు నింపి సస్యశ్యామలం చేసే అవకాశం ఉందని ప్రభుత్వానికి రిటైర్డ్ ఇంజనీర్ల ఫోరం ప్రభుత్వానికి లేఖ రాసిందని వెల్లడించారు. మేడిగడ్డ గేట్లు దించితే భద్రాచలం రాముడు మునిగిపోతాడు అని రేవంత్ రెడ్డి అంటున్నాడని, 2022లో గోదావరిలో 15 రోజులు వరసగా దాదాపు 28లక్షల 50,000 క్యూసెక్కుల వరద వచ్చినా మేడిగడ్డ తట్టుకొని నిలబడిందని, ఇప్పుడు కేవలం లక్ష క్యూసెక్కులు మాత్రమే వస్తుందని, ఇప్పుడు ఎందుకు తట్టుకోదు? అని కేటీఆర్ ప్రశ్నించారు. రేవంత్ రెడ్డికి పైసలు ఎత్తిపోయడం బాగా తెలుసు, నీళ్లు ఎత్తిపోయడం తెలవదని, ఢిల్లీకి సంచులు మోయడం తెలుసు, కానీ ధాన్యం సంచులు నింపడం తెలవదు అని ఎద్దేవా చేశారు.
EMI ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి EMI కట్టకపోతే ఢిల్లీలో ఉద్యోగం పోతదని సెటైర్లు వేశారు.

**ఎవరికి బుర్ర తక్కువో ప్రజలకు అర్థమవుతుంది...**

గోదావరిలో కళ్ల ముందు లక్ష క్యూసెక్కుల నీళ్లు వరదలాగా కిందకి పోతుంటే అక్కడ ఎత్తిపోయడానికి నీళ్లు లేవు అన్నవాడు బుర్రతక్కువ వాడా? లేదా రైతుల కోసం ఈ పని చేయమన్నోడు బుర్రతక్కువ వాడా? అని కేటీఆర్ ప్రశ్నించారు. కన్నెపల్లి వద్ద 93 మీటర్ల నుండే నీళ్లు ఎత్తిపోసే అవకాశం ఉంటే.. రాజకీయ ద్వేషంతో కళ్లు మూసుకున్న రేవంత్ రెడ్డి బుర్రతక్కువ వాడివో కాదో చెప్పాలన్నారు. అలాగే మేడిగడ్డ వద్ద 97 మీటర్ల ఎత్తులో నీళ్లు పోతుంటే కళ్లు ఉండి చూడలేని నువ్వు బుర్రతక్కువ వాడివా.. లేదా వాస్తవాలు చూపించే మేము తెలివి లేనివాళ్లమో ప్రజలు చెప్పాలన్నారు. పోలవరం వల్ల మునిగే భద్రాచలాన్ని పట్టుకొని మేడిగడ్డ వల్ల మునిగిపోతుంది అంటున్న నీకు బుర్రలేదు అని రేవంత్ పై కేటీఆర్ మండిపడ్డారు.పోలవరం ముంపు కోసమే కదా భద్రాచలంలోని కొన్ని మండలాలను బీజేపీ ఏపీలో కలిపిందని, మరి పోలవరం గురించి ఎందుకు మాట్లాడవు రేవంత్ రెడ్డి? నీ గురువుకు కోపం వస్తుందనా? అని కేటీఆర్ ప్రశ్నించారు. రైతాంగం మొత్తం కన్నెపల్లి నుండి నీళ్లు ఇవ్వమంటే పట్టించుకొని వాడిని బుర్రతక్కువ వాడు అనాలా లుచ్చా అనాలా అని ప్రశ్నించారు. గురువు చంద్రబాబు కోసం నీళ్లు కిందకి వదులుతున్నావా అని రైతులు అడిగితే దానికి సమాధానం చెప్పే దమ్ము లేని వాడిని దద్దమ్మ అనాలా, దరిద్రుడు అనాలా, ఏమనాలని నిలదీశారు. రేవంత్ రెడ్డికి హైట్ ఒక్కటే తక్కువ అనుకున్నా బుర్ర కూడా తక్కువేనని విమర్శించారు.



**దమ్ముంటే 10మందితో రాజీనామా చేయించి ఉప ఎన్నికలకు రా...**

రాహుల్ గాంధీ 2014 నుండి 3 సార్లు ఓడిపోయాడని, అయితే దేశంలో కాంగ్రెస్ పని అయిపోయినట్లేనా అని, బీఆర్ఎస్ ఒక్కసారి ఓడితే ఏమైపోతుందని కేటీఆర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీకి వచ్చే ఎన్నికల్లో 117 కాదు 7 అసెంబ్లీ స్థానాలు కూడా రావు అని, దమ్ముంటే బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లోకి తీసుకున్న 10మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి ఉప ఎన్నికల్లో ఎవరి బలమెంతో తేల్చుకోవడానికి సిద్ధమా అని కేటీఆర్ సవాల్ చేశారు. రాష్ట్రాన్ని తెచ్చిన కేసీఆర్ లాంటి పవర్ ఫుల్ పార్టీ ఒక్క ఎన్నికలో మీ దొంగ ఓట్లతో ఓడిపోతే అయిపోయినట్లేనా అంటూ నిలదీశారు. తెలంగాణ ప్రజల మీదకి తుపాకీ తీసుకుపోయిన నీకే ఇంతుంటే, తెలంగాణ కోసం కొట్లాడిన మాకేంత ఉండాలన్నారు.

**కేసీఆర్ తయారు చేసిన సైనికుడు హరీశ్ రావు..**

కేసీఆర్ తయారు చేసిన సైనికుడు హరీశ్ రావు అని, పార్టీ ఆవిర్భావం నుంచి.. కేసీఆర్‌కు ఒక రక్షణకవచంలా నిల్చున్న నాయకుడని కేటీఆర్ పేర్కొన్నారు. నాకు క్యారెక్టర్ ముఖ్యం.. ఏ పార్టీలోకి చేరట్లేదని ఆయన ఎన్నోసార్లు చెప్పాడని, రేవంత్ రెడ్డిలాగా నేను నాలుగు పార్టీలు మారేవాడ్ని కానని క్లారిటీ ఇచ్చాడని, మళ్లీ బీజేపీ లోకి పోనంటూ ఒట్టేయాలని రేవంత్ అడగడం హాస్యాస్పదం అన్నారు. ఈ దేశంలో ఎవరికైనా శీల పరీక్ష పెట్టాల్సి వస్తే.. అది రేవంత్ రెడ్డికే పెట్టాలని, మా హరీష్ రావు గురించి మాట్లాడే స్థాయి రేవంత్ రెడ్డికి లేదు అన్నారు. ఢిల్లీకి పోయి బీజేపీ కాళ్ళు పట్టుకునే రేవంత్ రెడ్డి కూడా హరీష్ రావు గురించి మాట్లాడతాడా? అని, రేవంత్ రెడ్డి ఢిల్లీకి పోతే పొద్దున కాంగ్రెస్ వాళ్ళతో ఉంటాడు.. రాత్రికి బీజేపీ వాళ్ళతో ఉంటాడని కేటీఆర్ ఆరోపించారు. దేవుళ్ల మీద ఒట్టేసి అబద్ధాలు చెప్పడం రేవంత్ రెడ్డికి అలవాటుగా మారిందని, రాముడి మీద ఒట్టు అంటూ రేవంత్ రెడ్డి మాట్లాడే ముందు ఆలోచించుకోవాలని, అబద్ధాలు చెప్తే ఆయనకే నష్టం తప్పదని హెచ్చరించారు.



## హరీశ్ రావుపై పోటీకి నేను రె'డీ'

**సంగారెడ్డి, జులై 11 (ప్రభాత ఉదయం)**

గత అసెంబ్లీ ఎన్నికల్లో సంగారెడ్డి నుంచి పోటీ చేసి ఓడిన జగ్గారెడ్డి.. ఇక వచ్చే ఎన్నికల్లో నా బదులుగా నా భార్య పోటీ చేస్తుందంటూ ప్రకటించారు. అయితే తాజాగా జగ్గారెడ్డి మీడియా చిట్ చాట్ లో మాట్లాడుతూ గతంలో తను చెప్పిన వ్యాఖ్యలకు భిన్నంగా స్పందించారు. వచ్చే ఎన్నికల్లో సంగారెడ్డి నియోజకవర్గం రిజర్వేషన్ మహిళా, జనరల్ ఏది ఉన్నా కాంగ్రెస్ అభ్యర్థి తన సతీమణి నిర్మలా జగ్గారెడ్డినే అని స్పష్టం చేశారు. అదే సమయంలో అధిష్టానం ఆదేశిస్తే నేను వచ్చే ఎన్నికల్లో మాజీ మంత్రి హరీశ్ రావుపై పోటీ చేసేందుకు సిద్ధమేనని ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో సంగారెడ్డిలో తాను పోటీ చేయబోవడం లేదని గతంలో చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ.. నేను సంగారెడ్డిలో మాత్రమే పోటీ చేయనన్నానని చెప్పానని... కానీ వేరే చోట పోటీ చేయను అనలేదు కదా అని కొత్త ట్విస్టు ఇచ్చారు. నేను ఎక్కడ పోటీ చేయాలో పార్టీ నిర్ణయిస్తుందంటూ పేర్కొన్నారు. రాజకీయాల్లో పర్మినెంట్‌గా ఎవరూ తోపులు ఉండరన్నారు. పెద్ద పెద్ద తోపులను కూడా ప్రజలు ఎన్నికల్లో పక్కన పెట్టేసిన చరిత్రలు ఉన్నాయని, అందుకే సిట్టింగ్ ఎమ్మెల్యే తోపు కాదు సీఎం, పీసీసీ చీఫ్, ఇంచార్జీ మాత్రమే తోపులన్నారు. సిటింగ్ ఎమ్మెల్యేలలో కొందరి పనితీరు సరిగా లేదని సీఎం చెప్పారని, వారు పనితీరు మార్చుకోకపోతే, వచ్చే ఎన్నికల టికెట్ ఇవ్వాలో వద్దో సీఎం, పీసీసీ చీఫ్, ఇంచార్జీ నిర్ణయం తీసుకుంటారని జగ్గారెడ్డి స్పష్టం చేశారు.

# వియత్నాంలో ఘోర విషాదం

**కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు!**

ఈ ప్రమాదంపై సమాచారం, సహాయం అందించేందుకు అధికారులు కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు చేశారు. హనోయిలోని భారత రాయబార కార్యాలయంతోపాటు హో చి మిన్ సిటీలోని భారత కాన్సులేట్ జనరల్ ఆఫీస్‌లోనూ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఎలాంటి సందేహాలు ఉన్నా లేదా సహాయం అవసరమైనా తమను సంప్రదించవచ్చని భారత దౌత్య కార్యాలయం హెల్ప్‌లైన్ నెంబర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది.

**సహాయం కోసం డయల్ చేయాల్సిన హెల్ప్‌లైన్ నెంబర్లు**

+84 36 281 7930
+84 91 552 37 14
+84 33 452 0414
+84 91 308 9165

**గతేడాది హాలాంగ్ బేలో ప్రమాదం**

వియత్నాంలో సరిగ్గా ఏడాది క్రితం ఇలాంటి పడవ ప్రమాదమే ఒకటి జరిగింది. 2025 జులైలో వియత్నాంలోని అత్యంత ప్రసిద్ధ పర్యాటక ప్రాంతమైన హాలాంగ్ బేలో భారీ ప్రమాదం సంభవించింది. 48 మంది పర్యాటకులతో ప్రయాణిస్తున్న ఒక బోటు తుపాను వల్ల వచ్చిన బలమైన గాలులతో సముద్రంలో మునిగిపోయింది. ఆ ప్రమాదంలో 20 మంది పిల్లలతో సహా మొత్తం 35 మంది పర్యాటకులు ప్రాణాలు చనిపోయారు. ఈ ఘటన గతేడాది ప్రపంచ వ్యాప్తంగా సంచలనంగా మారింది. హాలాంగ్ బే ప్రమాదం వియత్నాం దేశంలో పర్యాటక బోట్ల భద్రతా ప్రమాణాలపై అంతర్జాతీయంగా తీవ్ర చర్చకు దారితీసింది. ఆ ఘటన జరిగి ఏడాది గడవక ముందే, ఇప్పుడు మళ్లీ ఫు క్వాక్ ద్వీపం వద్ద భారత పర్యాటకులతో వెళ్తున్న బోటు ప్రమాదానికి గురికావడం వల్ల పర్యాటకులు మళ్లీ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



# ఎన్యుమరేషన్ ఫారాలను ప్రతి ఓటరుకు చేరవేయడంలో సహకరిస్తున్న వాలంటీర్లకు ప్రశంసా పత్రాలు

## ఓటరు ఎన్యుమరేషన్ ఫారాలను పూర్తి చేసి ఇవ్వడానికి రంగంలోకి దిగిన యూసీడీ విభాగం అధికారులు, సిబ్బంది


హెల్ప్ డెస్క్ వద్ద అత్తాపూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డి


యువతికి ఎన్యూమరేషన్ ఫారాన్ని అందచేస్తున్న డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డి


ఎర్రబోడ లో ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తున్న బీజేపీ మహిళా మోర్చా రంగారెడ్డి జిల్లా కార్యదర్శి మేకల వనితా రెడ్డి

**బుద్వేల్, జూలై 11 (ప్రభాత ఉదయం)**

ఓటర్ల జాబితా లో పేర్ల నమోదు కోసం కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ను పూర్తి స్థాయిలో విజయవంతం చేయడానికి రాజేంద్రనగర్ జోన్ పరిధిలో పనిచేస్తున్న అధికారులు కొత్త కొత్త మార్గాలను ఎంచుకుంటున్నారు. సర్ ప్రక్రియ లో ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, వాటిని పూర్తి చేయడంలో స్వచ్ఛందంగా సహకరిస్తున్న సామాజిక కార్యకర్తలకు, యువజన సంఘాల సభ్యులకు ప్రశంసా పత్రాలను అందజేయనున్నట్లు ప్రకటించారు. జోన్ పరిధిలోని అర్బన్ కమ్యూనిటీ డెవలప్మెంట్ (యూసీడీ) విభాగానికి చెందిన అధికారులు, సిబ్బంది బస్తీలలోకి వెళ్లి ఓటర్ల ఎన్యుమరేషన్ ఫారాలను పూర్తి చేసి వాటిని ఆన్లైన్ లో అప్ లోడ్ చేస్తున్నారు. రాజకీయ పార్టీల నాయకులు మేము సైతం అంటు ఓటరు జాబితాలో పేర్ల నమోదు కార్యక్రమానికి తమ వంతు సహకారాన్ని అందజేస్తున్నారు.

**సర్ వాలీంటర్లకు ప్రశంసా పత్రాలు : అత్తాపూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డి :**

ఓటర్ల గుర్తింపు కార్డు కోసం కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) లో అధికార యంత్రాం గానికి స్వచ్ఛందంగా సహకరిస్తున్న వాలీంటర్లకు ప్రత్యేక గుర్తింపు ఇవ్వనున్నట్లు అత్తాపూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డి తెలిపారు. సర్ లో రాజకీయ పార్టీల నాయకులు కాకుండ స్వచ్ఛంధ సం స్థల ప్రతినిధులు సామాజిక కార్యకర్తలు వాలీంటర్లుగా కలసి వచ్చి తమకు సహకరించాలని కోరారు. హైదర్గూడ డివిజన్ లక్ష్మీ రాం హరన్ హరన్ అపార్ట్మెంట్ ఆవరణలో శనివారం ఏర్పాటైన వాలీంటర్ల హెల్ప్ డెస్క్ ను డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డి ప్రారంభించారు. సర్ లో ఓటరు నమోదు కోసం ప్రజలు కదిలి రావాలన్నారు. కొన్ని ప్రాంతాలలో ఓటరు నమోదు ప్రక్రియ మందకోడిగా సాగడం పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రాజకీయ పార్టీల కార్యకర్తలు, విద్యార్థులు, యువజన సంఘాలు, స్వచ్ఛంద సం స్థల సభ్యులు కలసి వచ్చి బూత్ లెవల్ ఆఫీసర్లకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త మ్యాడం మధుసూదన్ తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

**యూసీడీ విభాగం డిప్యూటీ ప్రాజెక్టు ఆఫీసర్ స్వాతి ఆధ్వర్యంలో ప్రతి వీధి కి వెళ్లి.....**

రాజేంద్రనగర్ సర్కిల్ అర్బన్ కమ్యూనిటీ డెవలప్మెంట్ (యూసీడీ) విభాగం డిప్యూటీ ప్రాజెక్టు ఆఫీసర్ స్వాతి ఆధ్వర్యంలో శనివారం రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలోని మాణిక్యమ్మ కాలనీ లో ఇంటింటికి వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలు అందాయా.. పూర్తి చేసి ఇచ్చారా.. అంటు ఆరా తీశారు. స్థానిక పోచమ్మ దేవాలయం ఆవరణలో కూర్చుని ఎన్యుమరేషన్ ఫారాలను నింపడానికి రాని వారి వివరాలు తెలుసుకుని వారి ఫారాలను నింపి ఆన్లైన్ చేయించే పనులలో సహకారం అందజేశారు. రాజేంద్రనగర్ సర్కిల్ లోని ప్రతి బస్తీకి వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలను పూర్తి చేసే కార్యక్రమంలో ఉన్నామని స్వాతి తెలిపారు.

**వ్యవసాయ విశ్వవిద్యాలయం లో.....**

అగ్రికల్చర్ యూనివర్శిటీ విద్యార్థుల సహకారంతో ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా ఆన్లైన్ ఎన్యుమరేషన్ ఫారమ్ల నమోదు ప్రక్రియ చేపట్టడం జరిగింది. విద్యార్థులకు డీపీవో స్వాతి గారు, బీఎల్వోలు , సూపర్వైజర్లు అవసరమైన మార్గదర్శకాలు అందిస్తూ, ఫారమ్ల నమోదు విధానాన్ని వివరించారు. ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని వేగవంతంగా, సమర్థవంతంగా అమలు చేయడానికి విద్యార్థుల సేవలను వినియోగిస్తూ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తున్నారు.

**ఎర్రబోడ లో సర్ ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, స్వీకరణ :**

అత్తాపూర్ సర్కిల్ హైదర్ గూడ డివిజన్ లోని ఎర్రబోడ మండల పరిషత్ పాఠశాల ఆవరణలో ఓటర్లకు ఎన్యుమరేషన్ పత్రాలను అందజేసి వాటిని పూర్తి చేశాక తిరిగి తీసుకున్నారు. ఈ పనులలో స్థానిక బీజేపీ నాయకులు బీఎల్ ఓ లు రాజు, రేఖ, అరుణ లకు సహకారం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ మహిళా మోర్చా రంగారెడ్డి జిల్లా కార్యదర్శి మేకల వనితా రెడ్డి మాట్లాడుతూ, సర్ ఫారాల విషయంలో ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. నాయకులు మల్లేశ్ చారి, వెంకటేశ్ లతో కలసి ఇప్పటి వరకు ఎన్యుమరేషన్ ఫారాలను తీసుకోని వారికి తీసుకునేటట్లు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.

**లక్ష్మీగూడ పరిసర కాలనీలలో... :**

లక్ష్మీగూడ, వాంబే కాలనీ, రాజీవ్ గృహకల్ప తదితర ప్రాంతాలలో జరుగుతున్న ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, స్వీకరణ కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు అడికె మహేందర్ పరిశీలించారు. ప్రతి ఒక్క ఓటరు ఎన్యుమరేషన్ ఫారాలను తీసుకుని ఈ నెల 24 లోగా పూర్తి చేసి ఇవ్వాలని కోరారు.


వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులకు ఆన్ లైన్ లో ఎన్యూమరేషన్ దరఖాస్తులను ఎలా అప్ లోడ్ చేయాలో నేర్పిస్తున్న రాజేంద్రనగర్ సర్కిల్ యూ సీ డీ విభాగం డిప్యూటీ ప్రాజెక్ట్ ఆఫీసర్ స్వాతి


మాణిక్యమ్మ కాలనీ లో ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తి చేస్తున్న డిప్యూటీ ప్రాజెక్ట్ ఆఫీసర్ స్వాతి


లక్ష్మీ గూడ లో ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తున్న బి ఎల్ ఓ లు, బీజేపీ నాయకులు అడికె మహేందర్

# ఆలోచిస్తేనే 'ట్రాఫిక్' వణుకు.. మియాపూర్ వైపు వెళ్లాలంటేనే భయం!

**ఫ్లైఓవర్, ఆర్‌యూబీ పనులతో జటిలం కానున్న రద్దీ**

**క్షేత్రస్థాయిలో జాయింట్ సీపీ సన్‌ప్రీత్ సింగ్ పర్యవేక్షణ**

**కాగితాలకే పరిమితమా? క్షేత్రస్థాయిలో అమలవుతాయా? ప్రయాణికుల ఆందోళన**

**శేరిలింగంపల్లి : జూలై 11,( ప్రభాత ఉదయం)**

మహానగరంలో ఐటీ కారిడార్‌కు ముఖద్వారంగా ఉన్న మియాపూర్.. ఇకపై వాహనదారులకు చుక్కలు చూపించబోతోందా? ఇప్పటికే పీక్ అవర్స్‌లో కిలోమీటర్ల మేర నిలిచిపోయే వాహనాలతో నరకం చూస్తున్న ప్రయాణికులకు.. త్వరలో ప్రారంభం కానున్న ఫ్లైఓవర్ పనులు మరింత గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ సన్‌ప్రీత్ సింగ్, క్షేత్రస్థాయి పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది.రోడ్డు ఎక్కితే 'నరకమే'.. గుండెల్లో వణుకు పుట్టిస్తున్న ఫ్లైఓవర్ పనులు!రోజు రోజుకూ పెరుగుతున్న వాహనాల సంఖ్య ఒకవైపు.. నత్తనడకన సాగే రోడ్డు పనులు మరోవైపు ఐటీ ప్రయాణికులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఇప్పటికే మియాపూర్, ఆల్విన్ చౌరస్తా దాటాలంటే గంటల సమయం పడుతోంది. ఇక ఫ్లైఓవర్ పనులు గనక మొదలైతే ఆ రోడ్డు వైపు వెళ్లడమే ఒక పెద్ద సాహసం. ఆలోచిస్తేనే భయమేస్తోంది. అని నిత్యం ప్రయాణించే ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగి వాపోయారు.ప్రస్తుతం మియాపూర్ ఫ్లైఓవర్ నిర్మాణ పనులతో పాటు, మైహోమ్ మంగళ రైల్వే అండర్ బ్రిడ్జ్ (ఆర్ యూబీ) పనులు కూడా తోడవడంతో పరిస్థితి మరింత జటిలంగా మారింది. ఈ పనుల పర్యవేక్షణలు, అధికారుల సమీక్షలు కేవలం కాగితాలకే పరిమితమవుతాయా లేక క్షేత్రస్థాయిలో వాహనదారుల కష్టాలను తీరుస్తాయా అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది.


మియాపూర్ ఫ్లైఓవర్ ఆర్ యూబీ పనులన పరిశీలిస్తున్న జాయింట్ సీపీ ఇతర అధికారులు..

**రంగంలోకి జాయింట్ సీపీ ట్రాఫిక్ డైవర్షన్ ప్లాన్ పరిశీలన**

పరిస్థితి తీవ్రతను ముందే ఊహించిన సైబరాబాద్ ట్రాఫిక్ విభాగాధిపతులు క్షేత్రస్థాయి పరిశీలనకు దిగారు. జాయింట్ సీపీ సన్‌ప్రీత్ సింగ్ స్వయంగా మియాపూర్, మైహోమ్ మంగళ ప్రాంతాలను సందర్శించి పనుల పురోగతిని సమీక్షించారు. అధికారులకు జాయింట్ సీపీ కీలక ఆదేశాలు జారీ చేశారు. ఎన్ హెచ్ 65లో మియాపూర్ నుంచి ఆల్విన్ వరకు సర్వీస్ రోడ్ అభివృద్ధి కోసం ప్రతిపాదించిన ట్రాఫిక్ డైవర్షన్లను నేరుగా అమలు చేయకుండా, ముందుగా 'ట్రయల్ రన్' నిర్వహించి లోపాలను సరిదిద్దు కోవాలని సూచించారు. డైవర్షన్ పాయింట్ల వద్ద వాహనదారులకు గందరగోళం లేకుండా బ్యారికేడ్లు, రాత్రి వేళల్లో మెరిసే హెచ్చరిక బోర్డులు, దిశా సూచికలను ఏర్పాటు చేయాలని చెప్పారు. జీహెచ్ఎంసీ, సీఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, ట్రాఫిక్ పోలీసులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలి. ఈ ఉన్నత స్థాయి పర్యటనలో జాయింట్ సీపీతో పాటు ట్రాఫిక్ డీసీపీ 2 శేషాద్రి రెడ్డి, డీసీపీ–× ఎస్. రవికుమార్, అదనపు డీసీపీ టి. హనుమత్ రావు, మియాపూర్ ఏసీపీ ఆదిమూర్తి, మాధాపూర్, గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్లు తోపాటు సీఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు పాల్గొన్నారు. అధికారుల దండు అంతా కదిలి రోడ్డుపైకి వచ్చి సమీక్షలు నిర్వహించడం బాగున్నా.. పనులు మొదలయ్యాక ట్రాఫిక్ పోలీసులు రోడ్లపై నిలబడి ఎంతవరకు సమర్థవంతంగా నియంత్రిస్తారనే దానిపైనే ఈ ప్రాజెక్టుల సక్సెస్ ఆధారపడి ఉంది. మరి ఈ ఆందోళనల నడుమ ప్రయాణికులకు ఎంతవరకు ఊరట లభిస్తుందో వేచి చూడాలి.




# ఉద్యమకారులకు బీఆర్ఎస్ అండ..

**బీఆర్ఎస్ యువ నాయకులు పట్లోళ్ల కార్తీక్ రెడ్డి**

**పట్లోళ్లకార్తీక్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ మలిదశ ఉద్యమకారుడికి అరుదైన గౌరవం..**

**రాజేంద్రనగర్,జులై11(ప్రభాత ఉదయం)**

ఉద్యమకారులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని బీఆర్ఎస్ యువ నాయకులు,రాజేంద్రనగర్ నియోజకవర్గం పార్టీ ఇంచార్జి కార్తీక్ రెడ్డి స్పష్టం చేశారు.అందులో భాగంగా మైలార్ దేవ్ పల్లి డివిజన్ ఉపాధ్యక్షునిగా ఉద్యమకారుడు రవీందర్ యాదవ్ ను నియమించారు.ఈ సందర్భంగా కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ...మలిదశ తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి రానున్న కాలంలో అరుదైన గౌరవం దక్కుతుందన్నారు.ఉద్యమాన్ని ఊపిరిగా మలుచుకొని త్యాగానికి సిద్ధమై ముందుకు పోరాటాన్ని ఎదిరించి కొనసాగుతున్న కాలంలో ఆరోజు నుంచి ఈరోజు పార్టీలో కొనసాగుతున్న ప్రతి ఒక్క నాయకుడికి కీలక గౌరవం దక్కుతుందని అన్నారు.దానికి నిలువెత్తు నిదర్శనమే ఉద్యమకారుడు అయిన రవీందర్ యాదవ్ మైలార్ దేవ్ పల్లి డివిజన్ ఉపాధ్యక్షులుగా నియమించి నిరూపించమన్నారు.అనంతరం రవీందర్ యాదవ్ మాట్లాడుతూ...తెలంగాణ ఉద్యమాన్ని తన ఊపిరిగా మలుచుకొని పోరాడినట్టు తెలిపారు.తనకు ఇచ్చిన పదవికి కూడా తగిన న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో నాయకులు సుభాష్ రెడ్డి,పోరెడ్డి ధర్మారెడ్డి,ఉద్యమకారుడు ఎర్రోళ్ల యాదయ్య,గుమ్మడి కుమార్,డి.రమేష్ ముదిరాజ్,నోముల రాముయాదవ్,రాఘవేందర్ యాదవ్,మైసిరెడ్డి,కోనమొల్ల శ్రీనివాస్,సరికొండ దుర్గేష్,మంచర్ల చిరంజీవి,అశోక్ కురుమ,ఏరువా సరితా మహేష్,నవీన్,రమణి యాదయ్య,విజయ్,క్రాంతి కుమార్,నరేష్ యాదవ్,వినోద్,ప్రవీణ్,రిషి,తదితరులు పాల్గొన్నారు.




# యువకుడు అనుమానస్పదంగా మృతి

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 11 (ప్రభాత ఉదయం)**

జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో ఓ యువకుడు అనుమానస్పదంగా మృతి చెందాడు. గద్వాల పట్టణం సుంకులమ్మ మెట్టులో నివసిస్తున్న రాముడు సువర్ణమ్మల కుమారుడు నాని అలియాస్ నరేందర్(20) తోటి మిత్రులతో కలిసి నవరంగ్ థియేటర్ మీద తోటి మిత్రులతో కలిసి కూర్చొండగా. ప్రమాదవశాత్తు నాని కిందపడగా తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన నానిని గద్వాల జిల్లా ఆసుపత్రి కి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. గత కొంతకాలంగా నవరంగ్ థియేటర్ మూసి ఉండటంతో అసాంఘిక కార్యకలపాలకు అడ్డగా మారిందని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. యువత థియేటర్ పై కి చేరి జల్సాలకు పాల్పడుతున్నట్లు గంజాయికి అలవాటి పడినట్లు ఆరోపిస్తున్నారు.


జెండా ఆవిష్కరిస్తున్న మహిళా సమాఖ్య నాయకులు




సమావేశంలో మాట్లాడుతున్న నేదునూరి జ్యోతి

# చట్టసభలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

**బుద్వేల్, జూలై 11 (ప్రభాత ఉదయం)**

దేశ జనాభ లో సగ బాగం ఉన్న మహిళలకు చట్టసభలలో కనీసం 33 శాతం రిజర్వేషన్లను తక్షణమే అమలు చేయాలని భారత జాతీయ మహిళ సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి డిమాండ్ చేశారు. శనివారం ఉదయం బుద్వేల్ లోని సీపీఐ రాజేం ద్రనగర్ మండల కార్యాలయంలో మహిళా సమాఖ్య నాయకురాలు అరుణ, నీలమ్మ ల అధ్యక్షతన రం గారెడ్డి జిల్లా భారత జీతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐ డబ్ల్యు) 5వ మహి సభ జరిగింది. ముఖ్య అతిధిగా పాల్గొన్న నేదునూరి జ్యోతి మాట్లాడుతు, కేంద్ర ప్రభుత్వం నారీ శక్తి వందన్ అభియాన్ పేరుతో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదించినప్పటికి, నియోజకవర్గాల పునర్విభజన పేరుతో 2029 సం వత్సరానికి వాయిదా వేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తక్షణమే మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించడానికి ప్రయత్నాలు చేయాలన్నారు. స్త్...




వైద్య శిబిరం

# అత్తాపూర్ పోలీసులకు ఆరోగ్య పరీక్షలు

**బుద్వేల్, జూలై 11 (ప్రభాత ఉదయం)**

శాంతిభద్రల పరిరక్షణ లో నిత్యం సేవలందించే పోలీసులు ఆరోగ్యంగా ఉండటానికి అత్తాపూర్ పోలీస్ స్టేషన్ లో శనివారం ఉచిత వైద్య శిభిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని ఇన్స్ పెక్టర్ కె నాగేశ్వర్ రావు తెలిపారు. మాక్స్ విజన్ ఆసుపత్రి సహకారంతో పోలీసులకు గుం డె, కంటి పరీక్షలు, రక్తపోటు, రక్తం లో చక్కెర స్థాయిలను కనుక్కొవడం తో పాటు ఆరోగ్య పరీక్షలను నిర్వహించారు. ముందుగా ఇన్స్ పెక్టర్ కె నాగేశ్వర్ రావు పరీక్షలు చేయించుకున్నారు. పోలీసు సిబ్బందికి ఇలాంటి ఉచిత వైద్య శిభిరాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. పలువురికి వైద్యులు ఆరోగ్య నియమాలను తెలియజేశారు. రాజేంద్రనగర్ డీసీపీ ఎస్ శ్రీనివాస్, ఏసీపీ తుల శ్రీనివాస్ ప్రోత్సాహంతో ఈ వైద్య శిభిరాన్ని ఏర్పాటు చేశామన్నారు.



# రంగారెడ్డి జిల్లాలో దారుణం..కత్తితో పొడిచి ఆరుగురి దారుణ హత్య

### పోక్సో కేసు పెట్టారన్న కక్షతో ఘోరం.. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురితో పాటు భార్యాపిల్లల దారుణ హత్య!








**రంగారెడ్డి,జులై11(ప్రభాత ఉదయం)**

రంగారెడ్డి జిల్లాలోని షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆరుగురు దారుణ హత్యకు గురైన ఘటన కలకలం సృష్టించింది.షాబాద్ మండల కేంద్రంలోని దైవాలగూడలో శుక్రవారం అర్ధరాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది.పోక్సో కేసు పెట్టారనే కక్షతో రాజ్ కుమార్ (28) ఘాతుకానికి ఒడిగట్టాడు.దైవాలగూడకు చెందిన పార్వతి రాజ్ కుమార్ కట్టుకున్న భార్య,ఇద్దరు కుమారులతో పాటు,తనపై పోక్సో కేసు పెట్టిన మైనర్ బాలిక,ఆమె తల్లి లకీపీ నాయనమ్మ రుక్కమ్మ,లను కత్తితో నరికి చంపాడు, మొదట షాబాద్ పీఆర్ఆర్ స్టేడియం సమీపంలో ఉన్న మైనరు బాలిక(17) ఇంట్లోకి ప్రవేశించి..ఆమెను బలవంతంగా లాక్కెళ్లే క్రమంలో బాలిక తల్లి, నాయనమ్మ అడ్డు పడ్డారు.నిందితుడు వారిద్దరినీ కత్తితో పొడిచి చంపాడు.అనంతరం బాలికను దైవాలగూడ సమీపంలోని అఖిల్ సాగర్ చెరువు సమీపంలోకి తీసుకెళ్లి పీక కోసి హత్య చేశాడు.అనంతరం దైవాలగూడలోని తన ఇంటికొచ్చి భార్య సరిత (33) తో పాటు ఇద్దరు కుమారులు పరీక్షిత్ (4) ,దైవీక్షిత్ (2) లను కత్తితో పీకలు కోసి దారుణంగా హతమార్చాడు.ఆ తర్వాత తండ్రి అరుణ్ కుమార్కు ఫోన్ చేసి "నేనే ఆరుగురిని చంపాను,నేను కూడా చనిపోతున్నా"అని చెప్పాడు. దీంతో అరుణ్ కుమార్ పోలీసులకు సమాచారం అందించారు.షాబాద్ పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.ఘటనాస్థలిని ఫ్యూచరిసిటీ సీపీ తరుణ్ జోషి పరిశీలించారు. బాలికను వేధించాడని ఆమె తల్లి మే 16న పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోక్సో కేసు నమోదు చేసి రాజ్కుమార్ను అరెస్టు చేశారు. బెయిల్పై తిరిగొచ్చిన నిందితుడు.. ఇవాళ అర్ధరాత్రి ఈ దారుణానికి పాల్పడ్డాడు.నిందితుడు రాజ్కుమార్..ఏడేళ్ల క్రితం సరితను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు.

**ఆరుగురిని చంపిన నిందితుడిని అప్పగించాలని ఆందోళన**

ఆరుగురి హత్య కేసులో మృతుల బంధువుల ఆందోళనతో షాబాద్లో ఉద్రిక్తత నెలకొంది.నిందితుడిని తమకు అప్పగించాలంటూ షాబాద్-కంది రహదారిపై బైఠాయించి ధర్నాకు దిగారు.రాజ్ కుమార్ వెంటనే అరెస్ట్ చేయకపోతే మరొకరి ప్రాణం తీస్తాడని ఆగ్రహం వ్యక్తం చేశారు.నిందితుడు రాజ్ కుమార్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడని,ఏడు ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నావ ఫ్యూచర్సిటీ సీపీ తరుణ్ జోషి తెలిపారు.నిందితుడు భార్య,పిల్లలను కూడా హత్య చేయడం పోలీసులను సైతం ఆశ్చర్యానికి గురి చేసిందని సీపీ తెలిపారు.

**షాబాద్ ఘటనలో సంచలనం.. సీఐ,ఎస్ఐలు సస్పెండ్..**
**నిందితుడిని పట్టిస్తే రూ.2లక్షల రివార్డ్..**

రంగారెడ్డి జిల్లాలోని షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆరుగురు దారుణ హత్యకు గురైన ఘటనపై పోలీసులు కీలక ప్రకటన చేశారు.నిందితుడు రాజ్ కుమార్ పై రూ.2 లక్షల రివార్డు ప్రకటించారు.అతడి ఆచూకీ తెలిపిన వారికి ఈ మొత్తాన్ని అందజేస్తామన్నారు.ఈ ఘటనలో షాబాద్ ఎస్సై రమేశ్ ను సస్పెండ్ చేసినట్లు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి వెల్లడించారు.ఈ కేసులో నిర్లక్ష్యం వహించిన అందరిపైనా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరపున అండగా ఉంటామన్నారు. మరోవైపు పరారీలో ఉన్న నిందితుడి కోసం 10 ప్రత్యేక బృందాలతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.సాంకేతిక ఆధారాలు,సీసీటీవీ దృశ్యాలు, టోల్గా వివరాల ఆధారంగా దర్యాప్తు వేగవంతం చేశారు.దైవాలగూడకు చెందిన పార్వతి రాజ్ కుమార్ కట్టుకున్న భార్య, ఇద్దరు కుమారులతో పాటు, తనపై పోక్సో కేసు పెట్టిన మైనర్ బాలిక, ఆమె తల్లి లక్ష్మీ, నాయనమ్మ రుక్కమ్మలను కత్తితో నరికి చంపిన విషయం తెలిసిందే. మొదట షాబాద్ పీఆర్ ఆర్ స్టేడియం సమీపంలో ఉన్న మైనరు బాలిక (17) ఇంట్లోకి ప్రవేశించి.. ఆమెను బలవంతంగా లాక్కెళ్లే క్రమంలో బాలిక తల్లి, నాయనమ్మ అడ్డు పడ్డారు. నిందితుడు వారిద్దరినీ కత్తితో పొడిచి చంపాడు. అనంతరం బాలికను దైవాల గూడ సమీపంలోని అఖిల్ సాగర్ చెరువు సమీపంలోకి తీసుకెళ్లి పీక కోసి హత్య చేశాడు. అనంతరం దైవాలగూడలోని తన ఇంటికొచ్చి భార్య సరిత (33) తో పాటు ఇద్దరు కుమారులు పరీక్షిత్ (4) , దైవీక్షిత్ (2) లను కత్తితో పీకలు కోసి దారుణంగా హతమార్చాడు.



# సెంచరీ పరుపుల పరిశ్రమలో అగ్నిప్రమాదం

### పరిశ్రమలో తరచుగా అగ్ని ప్రమాదాలు జరగడంపై స్థానికుల అనుమానాలు

**పటాన్ చెరు, జూలై 11( ప్రభాత ఉదయం)**




ఐడిఏ బొల్లారం పారిశ్రామిక వాడలోని సెంచరీ పరుపుల పరిశ్రమలో శనివారం రాత్రి అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో పరిశ్రమ లోని రెండు బ్లాకుల్లో పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. పెద్ద ఎత్తున మంటలు వ్యాపించి పరుపులు తగలబడ్డాయి. ప్రమాదం జరిగిన సమయంలో కేవలం ఇద్దరు వ్యక్తులు విధులు నిర్వహిస్తున్నారు. దీంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. జనరేటర్ సహాయంతో మంటలార్పడానికి పరిశ్రమ సిబ్బంది ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ పరిశ్రమకు ఆనుకుని రసాయన పరిశ్రమ ఉండడంతో పోలీసులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. ప్రమాదంలో ఎంత మొత్తం ఆస్తి నష్టం జరిగిందో అంచనా వేయాల్సి ఉంది. కాగా ఈ అగ్ని ప్రమాదం పై స్థానికంగా బిన్నవాదనలు వినిపిస్తున్నాయి. ప్రమాదవశాత్తు అగ్ని మంటలు వ్యాపించాయా..! లేక ఇన్సూరెన్స్ కోసం పరిశ్రమ వర్గాలు ఈ ప్రమాదాన్ని సృషించాయా అనే అనుమానం స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. తరచుగా ఈ సెంచరీ పరుపుల పరిశ్రమలో అగ్ని ప్రమాదం జరగడం సర్వసాధారణం అయిపోవడం వల్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అసలు విషయం దర్యాప్తు లో బయట పడాల్సి ఉంది.



# ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

### కాంగ్రెస్ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పూర్తి అంకితభావంతో పనిచేస్తా

### డీసీసీ కార్యదర్శిగా నియామకానంతరం ముఖ్య నాయకులను మర్యాదపూర్వకంగా కలిసిన శిరీష సత్తూర్

**కూకట్ పల్లి, జూలై 11 (ప్రభాత ఉదయం)**

రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) కార్యదర్శిగా నియమితులైన శేరిలింగంపల్లి కాంగ్రెస్ నాయకురాలు శిరీష సత్తూర్ మర్యాదపూర్వకంగా శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరకపూడి గాంధీని, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ గౌడ్ ని, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు చల్లా నరసింహా రెడ్డి ని వేర్వేరుగా కలిసి వారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా తనపై విశ్వాసం ఉంచి డీసీసీ కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి శిరీష సత్తూర్ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారం, కాంగ్రెస్ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో పూర్తి అంకితభావంతో పనిచేస్తానని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా నాయకులు శిరీష సత్తూర్‌కు అభినందనలు తెలియజేస్తూ, పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మందుల శివకుమార్, ప్రగతి నగర్ 1 వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మాచర్ల విష్ణు, పోసాల రాజు, కనక రెడ్డి, ముత్యం, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# హనుమాన్ నగర్‌లో పగిలిన తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు

### కొనసాగుతున్న పనులను పరిశీలించిన జిల్లా గణేష్ నేత

**కూకట్ పల్లి, జూలై 11 (ప్రభాత ఉదయం)**



శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని ఉమ్మడి అల్విన్ కాలనీ 124వ డివిజన్ పరిధిలోని హనుమాన్ నగర్‌లో పగిలిపోయిన తాగునీటి పైప్‌లైన్ కారణంగా పెద్దఎత్తున నీరు రోడ్డుపై వృథాగా ప్రవహిస్తూ స్థానిక ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. ఈ సమస్యను కాలనీవాసులు ఎమ్మెల్యే గాంధీ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన వెంటనే స్పందించి సంబంధిత అధికారులకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు స్థానిక కాంగ్రెస్ నాయకులు జిల్లా గణేష్ నేత నీటి సరఫరా శాఖ అధికారులతో మాట్లాడి పరిస్థితిని వివరించారు. సమస్య తీవ్రతను గుర్తించిన అధికారులు వెంటనే మరమ్మతు బృందాలను సంఘటనా స్థలానికి పంపించి పైప్‌లైన్ మరమ్మతు పనులను ప్రారంభించారు. పనులు జరుగుతున్న ప్రాంతాన్ని జిల్లా గణేష్ నేత స్వయంగా సందర్శించి పరిశీలించారు. మరమ్మతు పనులు నాణ్యతతో పాటు వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ప్రజలకు తాగునీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా, భవిష్యత్తులో ఇటువంటి సమస్యలు తలెత్తకుండా అవసరమైన శాశ్వత చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా గణేష్ నేత మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారమే ఎమ్మెల్యే గాంధీ ప్రధాన లక్ష్యమని, ఏ సమస్య వచ్చినా వెంటనే స్పందించి పరిష్కరించే విధంగా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. స్థానిక ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రతి సమస్యను వేగంగా పరిష్కరించేందుకు కృషి కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. స్థానికులు తమ సమస్యపై వెంటనే స్పందించి మరమ్మతు పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకున్న ఎమ్మెల్యే గాంధీ, జిల్లా గణేష్ నేత, అలాగే నీటి సరఫరా శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. త్వరితగతిన సమస్య పరిష్కారమవుతుండటంతో హనుమాన్ నగర్ వాసులు హర్షం వ్యక్తం చేశారు.

# పోక్సో కేసు నిందితుడికి రిమాండ్

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 11 (ప్రభాత ఉదయం)**



పోక్సో కేసులో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు శనివారం కేటిదొడ్డి ఎస్ఐ పి.శ్రీనివాస్ తెలిపారు. కేటిదొడ్డి మండలంలో ఓ గ్రామానికి చెందిన బాలికను అదే గ్రామానికి చెందిన యువకుడు మాయమాటకు చెప్పి గత నెల 29వ తేదిన అపహరించి తీసుకెళ్లడంతో బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేటిదొడ్డి పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ పి.శ్రీనివాసులు తెలిపారు



# కార్మికులకు అన్యాయం జరిగితే సహించేది లేదు

### బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి

**కూకట్ పల్లి, జూలై 11 (ప్రభాత ఉదయం)**

ఏ ఒక్క కార్మికునికి అన్యాయం జరిగిన సహించేది లేదని బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి అన్నారు. కూకట్ పల్లి నియోజకవర్గం, మూసాపేట్ చౌరస్తా లోని "సీతమ్మ చాపల పులుసు హోటల్లో" పప్పు అనే కార్మికుడు హోటల్లో పని చేసేవారు. హోటల్ యజమాన్యం పప్పుకి గత నెల వేతనం రావాల్సి ఉండగా సీతమ్మ చాపల పులుసు హోటల్ యజమాన్యం అతన్ని పట్ల నిర్లక్ష్యం చేస్తూ అతనికి వేతనం ఇవ్వకుండా మాయమాటలు చెప్పి అతని ఇబ్బంది పెట్టేవారు. అడిగి అడిగి విసుగు చెందిన పప్పు అనే కార్మికుడు కి ఏం చేయాలో అర్థం కాక ఎవరైతే కార్మికులకు న్యాయం చేస్తారని తోటి కార్మిక మిత్రుల ద్వారా తెలుసుకొని, బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి గురించి తెలుసుకొని తన కార్యాలయం వద్దకు వచ్చి తనకు జరిగిన అన్యాయం గురించి వివరించారు. వెంటనే స్పందించిన కార్మిక నాయకుడు రవి హుటాహుటిన మూసాపేట్ చౌరస్తా లో ఉన్న హోటల్ యజమాన్యం దగ్గరికి వెళ్లి కార్మికుడు పప్పు కి రావాల్సిన వేతనం ఇప్పించడం జరిగింది. కార్మికుడు పప్పు మాట్లాడుతూ నాకు మా కుటుంబానికి న్యాయం చేసిన కార్మికనాయకుడు రవి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సంతోష్ గౌడ్ సుదర్శన్, జగన్, కిరణ్, పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ వాలంటీర్లకు ప్రశంసా పత్రాలు..

### వాలంటీర్లు కదిలి రండి... డిప్యూటీ కమిషనర్ పిలుపు

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 11 (ప్రభాత ఉదయం)**

ఓటర్ల గుర్తింపు కార్డు కోసం కొనసాగుతున్న స్పెషల్ ఎంటెన్సీ రివిజన్ లో అధికార యంత్రాంగానికి స్వచ్ఛందంగా సహకరిస్తున్న వాలంటీర్లకు ప్రత్యేక గుర్తింపును ఇవ్వనున్నట్లుఅత్తాపూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డి వెల్లడించారు. యజ్ఞంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ లో రాజకీయ పార్టీల నాయకులు కాకుండా స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సామాజిక కార్యకర్తలు వాలంటీర్లుగా కలిసివచ్చి తమకు సహకరించాలని మల్లారెడ్డి పిలుపునిచ్చారు. హైదర్గూడా డివిజన్



లక్ష్మీరాం హరన్ ఆవరణలో శనివారం ఏర్పాటైన వాలంటీర్ల హెల్ప్ డెస్క్ ను డిప్యూటీ కమిషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ ఐ ఆర్ లో ఓటర్ నమోదు కోసం ప్రజలు కదిలి రావాలని కోరారు. కొన్ని ప్రాంతాలలో ఎస్ఐఆర్ మందకొడిగా సాగడం పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రాజకీయ పార్టీల కార్యకర్తలు విద్యార్థులు, యువజన సంఘాల, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కలిసి వచ్చి బూతు లెవల్ అధికారులతో సహకరించాలని కోరారు. ఎస్ ఐ ఆర్ లో వాలంటీర్లుగా పనిచేసిన వారికి ప్రశంసా పత్రాలను అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన స్థానిక నాయకులు విజయ్ కుమార్, వెంకటేష్, నరేందర్ అలియాస్ చిన్న, పవన్ అగర్వాల్, వివిధ సంఘాలు,స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సాయి రెడ్డి, కన్నబాబు, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

# అక్కడ అలా... ఇక్కడ ఇలా

### రోగుల సహాయనికి కుటుంబ సభ్యులు.. మందుల రవాణాకు సిబ్బంది

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 11 (ప్రభాత ఉదయం)**



గద్వాల్ జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగుల అత్యవసర అవసరాలకు, తీవ్ర అనారోగ్యంతో ఉన్నవారిని తరలించడానికి ఉపయోగించాల్సిన స్ట్రెచర్లను మందుల బాక్సులు , వైద్య సామాగ్రిని మోయడానికి కేటాయించారు. దీనివల్ల ఆసుపత్రికి వచ్చే రోగులు, నడవలేని స్థితిలో ఉన్నవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆసుపత్రికి వస్తున్న రోగులను వీల్ చైర్ల మీద తరలించాల్సిన వార్డు బాయ్ సహాయకులు లేకపోవడంతో రోగుల బందువులే రోగులను తరలిస్తున్నారు. రోగుల కోసం కేటాయించిన సిబ్బంది మందుల స్టాక్‌ను లోపలికి తరలించడానికి కేటాయించడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. రోగుల కొరకు కేటాయించిన స్ట్రెచర్లను వారికే అందుబాటులో ఉంచాలని రోగుల బంధువులు ఆసుపత్రి అధికారులను కోరుతున్నారు.

# ఇల్లు మారితేనే కాదు.. అలవాటు మారితేనే స్వచ్ఛత!

### అంజయ్య నగర్‌లో 'వేస్టేజ్ డ్రైవ్' ప్రారంభం

### భారీ వ్యర్థాల సేకరణకు ప్రత్యేక వాహనాలు


### పరిశుభ్రత ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత: డివిజన్ నాయకులు ఆంజనేయులు సాగర్

**శేరిలింగంపల్లి : జూలై 11, (ప్రభాత ఉదయం)**

పరిశుభ్రత అనేది కేవలం మన ఇంటి నాలుగు గోడలకు పరిమితం కాకూడదు. రోడ్లు, కాలనీలు స్వచ్ఛంగా మారినప్పుడే సమాజం ఆరోగ్యంగా ఉంటుంది. బాధ్యత గల పౌరుడిగా ప్రతి ఒక్కరూ తమ వంతు పాత్ర పోషించినప్పుడే స్వచ్ఛమైన వాతావరణం సాధ్యమవుతుంది.ఈ ఆశయంతోనే అంజయ్య నగర్ డివిజన్ పరిధిలోని అంజయ్య నగర్ వార్డ్ ఆఫీస్ వద్ద శనివారం 'వేస్టేజ్ డ్రైవ్' కార్యక్రమాన్ని వైభవంగా ప్రారంభించారు. డి.ఈ.ఈ రూపా దేవి, డివిజన్ నాయకులు ఆంజనేయులు సాగర్ తో కలిసి ఈ ప్రత్యేక డ్రైవ్‌కు శ్రీకారం చుట్టారు.

**రోడ్లపై చెత్త వేయొద్దు.. వాహనాలకే ఇవ్వండి:**

ఇళ్లలో ఉపయోగం లేకుండా మూలన పడి ఉన్న పాత




ఫర్నిచర్, పరుపులు, పాత కుర్చీలు వంటి భారీ వ్యర్థాలను (బల్క్ వేస్ట్) సేకరించేందుకు ఈ డ్రైవ్‌లో ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేశారు. అంజయ్య నగర్, సిద్ధిక్ నగర్ కాలనీలలో పేరుకుపోయిన ఇటువంటి వ్యర్థాలను శాస్త్రీయంగా తొలగించి, కాలనీలను అద్దంలా మెరిపించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆంజనేయులు సాగర్ మాట్లాడుతూ మన ఇల్లు శుభ్రంగా ఉంటే మనకు గౌరవం లభిస్తుంది. అదే విధంగా మన పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ఆరోగ్యవంతమైన జీవనం, మంచి ఆలోచనలు, స్వచ్ఛమైన వాతావరణం ఏర్పడతాయి. ఇటువంటి మంచి అవకాశాన్ని ప్రజలు పూర్తిగా వినియోగించుకోవాలి. భారీ వ్యర్థాలను రోడ్లపై, ఖాళీ ప్లాట్లలో వేసి కాలనీ అందాలను పాడు చేయకుండా మున్సిపల్ ప్రత్యేక వాహనాలకే అప్పగించాలని పిలుపు నిచ్చారు. ప్రతిరోజూ ఇంటి నుంచి వచ్చే తడి, పొడి చెత్తను కూడా చెత్త సేకరణ వాహనాలకే అందించాలని ఆయన కోరారు. వీధులు, గల్లీలు, నాలాల వద్ద చెత్త వేయడం వల్ల అపరిశుభ్రత పెరిగి దోమలు, అంటువ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. పరిశుభ్రతను ఒక అలవాటుగా మార్చుకొని, పక్కవారిని కూడా చైతన్యపరచాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అంజయ్య నగర్ కాలనీ అధ్యక్షులు నరసింహా సాగర్, కురుమయ్యలతో పాటు మున్సిపల్ సిబ్బంది కిరణ్, రమేష్ కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కురిసిన ప్రతి వర్షపు చుక్కను ఒడిసిపట్టాలి







**ట్యాంకర్లపై ఆధారపడే పరిస్థితిని తగ్గించాలిలి**

**వర్షపు నీటి సంరక్షణ ప్రతి అపార్ట్‌మెంట్ బాధ్యత కావాలి**

**ఇంజక్షన్ బోర్ వెల్ ను ప్రారంభించిన జలమండలి ఎండీ అశోక్ రెడ్డి**

**హైదరాబాద్, జూలై 11(ప్రభాత ఉదయం)**

నగరంలో పెరుగుతున్న తాగునీటి అవసరాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రతి అపార్ట్‌మెంట్, గేటెడ్ కమ్యూనిటీ వర్షపు నీటి సంరక్షణను తప్పనిసరి బాధ్యతగా స్వీకరించాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం గుట్టల బేగంపేటలోని బీవర్లీ హిల్స్ లోని బీవర్లీ స్ప్రింగ్ అపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో పునర్నిర్మించిన మూడు ఇంకుడు గుంతలను, మరో ఇంకుడు గుంతను డ్రిల్లింగ్ చేసి ఇంజెక్షన్ బోర్‌గా మార్చిన రీచార్జ్ వ్యవస్థను ఆయన ప్రారంభించారు. ఇంకుడు గుంతను, పాడైపోయిన బోరుబావిని వినియోగించి ఏర్పాటు చేసిన రీఛార్జ్ పిట్(ఇంజక్షన్ బోర్ వెల్) ను ఆయన ప్రారంభించారు. అనంతరం అపార్ట్‌మెంట్ వాసులతో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎండీ అశోక్ రెడ్డి మాట్లాడుతూ.. వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాలను కేవలం భవన నిర్మాణ అనుమతులు లేదా ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ పొందడం కోసమే నామమాత్రంగా ఏర్పాటు చేయవద్దని ఎండీ స్పష్టం చేశారు. ప్రతి భవనం పైకప్పుపై కురిసే వర్షపు నీటి ప్రతి చుక్కను అదే ప్రాంగణంలో భూమిలోకి ఇంకేలా శాస్త్రీయంగా రూఫ్‌టాప్ రేన్‌వాటర్ హార్వెస్టింగ్ వ్యవస్థలు, ఇంకుడు గుంతలు, రీఛార్జ్ పిట్లు నిర్మించాలని సూచించారు. ప్రతి ఇంటిని, కుటుంబాన్ని, అపార్ట్‌మెంట్‌ను నీటి కొరత నుంచి రక్షించుకోవాలంటే వర్షపు నీటి సంరక్షణను మీ బాధ్యతగా స్వీకరించాలి అన్నారు. ప్రభుత్వం, జలమండలి చర్యలతో పాటు ప్రజల భాగస్వామ్యం ఉన్నప్పుడే నగరానికి శాశ్వత నీటి భద్రత సాధ్యమవుతుందని అని ఎండీ పేర్కొన్నారు.

**ట్యాంకర్ బుకింగ్‌లలో భారీ పెరుగుదల:**

గత ఏడాది వేసవిలో సుమారు 4 వేల అపార్ట్‌మెంట్లు జలమండలి ట్యాంకర్ నీటిని వినియోగించగా, ఈ ఏడాది ఆ సంఖ్య దాదాపు 12,500 అపార్ట్‌మెంట్లకు పెరిగిందని ఎండీ తెలిపారు. వర్షాలు కురుస్తున్న రోజుల్లోనూ కొన్ని ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో ట్యాంకర్ బుకింగ్‌లు నమోదవుతున్నాయని చెప్పారు. ట్యాంకర్ బుకింగ్ వ్యవస్థ ద్వారా ప్రతి అపార్ట్‌మెంట్, భవనం, ప్రాంతానికి సంబంధించిన రోజువారీ నీటి అవసరాల డేటా జలమండలి వద్ద అందుబాటులో ఉందన్నారు. ఈ సమాచారాన్ని విశ్లేషించి, అత్యధికంగా ట్యాంకర్లు బుక్ చేస్తున్న ప్రాంతాలను గుర్తించడంతో పాటు అవసరమైన ఫిల్లింగ్ స్టేషన్లు, ట్యాంకర్లు, సిబ్బందిని సమర్థవంతంగా వినియోగిస్తున్నట్లు తెలిపారు. గతంలో అయ్యప్ప సొసైటీ, కూకట్‌పల్లి, ఎస్.ఆర్.నగర్, జూబ్లీహిల్స్ ప్రాంతాల్లో ట్యాంకర్ డిమాండ్ అధికంగా ఉ ండేదని, ప్రస్తుతం కొన్ని ప్రాంతాల్లో డిమాండ్ తగ్గినప్పటికీ, సాధారణంగా నీటి సమస్య తక్కువగా ఉండే ఉప్పల్, ఎల్బీనగర్, ఎన్‌టీఆర్‌నగర్, మల్కాజిగిరి ప్రాంతాల్లో ఈ ఏడాది జూన్, జూలై నెలల్లో డిమాండ్ అనూహ్యంగా పెరిగిందన్నారు. వర్షాలు ఆలస్యంగా కురవడం, భూగర్భ జలమట్టాలు పడిపోవడం, బోర్లు ఎండిపోవడం ఇందుకు ప్రధాన కారణాలని వివరించారు.

**పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక వసతుల విస్తరణ:**

గతంలో 300 గజాల స్థలంలో ఒక కుటుంబం నివసించగా, ప్రస్తుతం అదే విస్తీర్ణంలో బహుళ అంతస్తుల భవనాలు నిర్మించి అనేక కుటుంబాలు నివసిస్తున్నాయని ఎండీ పేర్కొన్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లో నీటి అవసరం అనేక రెట్లు పెరుగుతోందన్నారు. ఒక కాలనీలో వందల సంఖ్యలో అపార్ట్‌మెంట్లు, వేల కుటుంబాలు ఏర్పడినప్పుడు పాత పైప్‌లైన్ల సామర్థ్యం సరిపోకపోవచ్చని తెలిపారు. జనాభా పెరుగుదల, నీటి డిమాండ్, సాంకేతిక అవసరాల ఆధారంగా పంపిణీ లైన్లు, రిజర్వాయర్లు, పంపింగ్ వ్యవస్థలు, వాల్వులు, అంతర్గత నెట్‌వర్క్‌లను దశలవారీగా అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. హైదరాబాద్‌కు కృష్ణా, గోదావరి తదితర దూరప్రాంత జలవనరుల నుంచి అనేక దశల్లో నీటిని పంపింగ్ చేసి తీసుకువస్తున్నామని చెప్పారు. ఇందుకు భారీ విద్యుత్ వ్యయం, పంపింగ్ స్టేషన్లు, ప్రధాన పైప్‌లైన్లు, నిరంతర పర్యవేక్షణ అవసరమవుతుందని పేర్కొన్నారు. జలమండలి సిబ్బంది రాత్రింబవళ్లు అప్రమత్తంగా పనిచేస్తూ నగరానికి నీటి సరఫరా నిలిచిపోకుండా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.

**ప్రజల భాగస్వామ్యంతోనే శాశ్వత పరిష్కారం:**

పైప్‌లైన్ ద్వారా అందించే నీటికి ట్యాంకర్ సరఫరాను శాశ్వత ప్రత్యామ్నాయంగా భావించరాదని ఎండీ సూచించారు. అపార్ట్‌మెంట్ సంఘాలు నీటి వినియోగంపై ఆడిట్ నిర్వహించడం, లీకేజీలను అరికట్టడం, వర్షపు నీటిని నిల్వ చేయడం, పాడైన బోరుబావులను రీఛార్జ్ పిట్లుగా మార్చడం ద్వారా ట్యాంకర్లపై ఆధారపడే పరిస్థితిని గణనీయంగా తగ్గించవచ్చన్నారు.

సక్రమంగా ఏర్పాటు చేసిన రూఫ్‌టాప్ రేన్‌వాటర్ హార్వెస్టింగ్ వ్యవస్థల ద్వారా భూగర్భ జలాలు పునరుద్ధరించవచ్చని, బోర్లలో నీటి లభ్యత మెరుగుపడి కనీసం కొన్ని నెలలపాటు ట్యాంకర్ అవసరం తగ్గుతుందని తెలిపారు. బీవర్లీ హిల్స్ లోని అపార్ట్‌మెంట్ వాసులు చేపట్టిన వర్షపు నీటి సంరక్షణ కార్యక్రమాన్ని ఎండీ అభినందించారు. వచ్చే ఏడాది నాటికి ఈ కాలనీ ట్యాంకర్ నీటి అవసరం లేకుండా ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ప్రతి కాలనీ, అపార్ట్‌మెంట్ ఇదే స్ఫూర్తితో ముందుకు వచ్చి వర్షపు ప్రతి చుక్కను సంరక్షించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జలమండలి సైబరాబాద్ రీజినల్ ఈడీ సంతోష్, డైరెక్టర్ (ఆపరేషన్స్) నారాయణ, జీఎం హరి శంకర్, ఇంకుడుగుంతల ప్రత్యేక అధికారి జాల సత్యనారాయణ, అపార్టుమెంటు అసోసియేషన్ ప్రెసిడెంట్ ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.



ఎర్రబోడ లో ఎస్ ఐ ఆర్ కార్యక్రమం నిర్వహిస్తున్న బిజెపి నాయకులు

## ఎస్ఐఆర్‌లో ప్రతి ఓటరు భాగస్వాములు కావాలి

**బిజెపి మహిళా మోర్చా జిల్లా నాయకురాలు మేకల వనిత రెడ్డి**

**ఎర్రబోడలో ఎస్ ఐ ఆర్ ఎన్యుమరేషన్ దరఖాస్తుల పంపిణీ, స్వీకరణ**

**రాజేంద్రనగర్, జూలై 11(ప్రభాత ఉదయం)**

కేంద్ర ఎన్నికల కమిషన్ ఎస్ ఐ ఆర్ కార్యక్రమంలో ప్రతి ఓటరు భాగస్వాములు కావాలని బిజెపి మహిళా మోర్చా నాయకురాలు మేకల వనితారెడ్డి అన్నారు. శనివారం అత్తాపూర్ సర్కిల్ హైదర్గూడ పరిధిలోని ఎర్ర బోడ ఎంపీపీ పాఠశాలలో గల 212, 213, 214 పరిధిలోగల ఓటర్లకు ఎస్ ఐ ఆర్ పత్రాలను బిజెపి నాయకులు బిఎల్ఓ లతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా బిజెపి మహిళా మోర్చా నాయకురాలు మేకల వనిత రెడ్డి మాట్లాడుతూ... ఎస్ ఐ ఆర్ పై ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఓటర్ల నుండి ఎస్ఐఆర్ దరఖాస్తులు పంపిణీ, స్వీకరణ చేశామని ఆమె తెలిపారు . ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు, మల్లేష్ చారి, వెంకటేష్, బి ఎల్ ఓ లు రాజు, రేఖ,అరుణ పాల్గొన్నారు.



ఓటర్లకు ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ పత్రాలు అందజేస్తున్న బిజెపి మహిళా మోర్చా నాయకురాలు మేకల వనితారెడ్డి



## ప్రతి ఓటరు ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగస్వామి కావాలి

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 11(ప్రభాత ఉదయం)**

కేటిదొడ్డి మండలం పాతపాలెం గ్రామంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తహసీల్దార్ కరుణాకర్ అధికారులు, బీఎల్‌వోలు పాల్గొని ఇంటింటికీ వెళ్లి ఓటరు నమోదు, వివరాల సవరణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమానికి ప్రతి అర్హత కలిగిన ఓటరు తప్పనిసరిగా సహకరించాలని కోరారు. ఓటరు జాబితాలో పేరు ఉన్న వారు తమ వివరాలను ఒకసారి పరిశీలించి, పేరు, చిరునామా లేదా ఇతర వివరాల్లో ఏవైనా మార్పులు ఉంటే వెంటనే సరిచేసుకోవాలని సూచించారు. బీఎల్‌వోలు ఇంటింటికీ వచ్చే సమయంలో ప్రజలు అవసరమైన పత్రాలు అందించి పూర్తి సహకారం అందించాలని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హత కలిగిన పౌరుడు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకుని తన ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మార్క శారద జనార్దన్, బీఎల్ ఓలు, తదితరులు పాల్గొన్నారు

## గద్వాల ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల అభివృద్ధికి ₹5 లక్షల విరాళం అందజేసిన పూర్వ విద్యార్థి సంగాల మహేశ్వర్ రెడ్డి





**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 11(ప్రభాత ఉదయం)**

ఎన్నో ఏళ్ల ఘన చరిత్ర కలిగిన గద్వాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల అభివృద్ధి కోసం ఆ పాఠశాల పూర్వ విద్యార్థి, ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ (సి.ఎ) సంగాల మహేశ్వర్ రెడ్డి తన వంతు సామాజిక బాధ్యతగా ₹5,00,000 భారీ విరాళాన్ని శనివారం పాఠశాల ప్రాంగణంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి చేతుల మీదుగా ఈ విరాళం చెక్కును పాఠశాల ప్రధానోపాద్యాయుల కు అందజేశారు. ఈ సందర్భంగా గద్వాల ఎమ్మెల్యే మాట్లాడుతూఅన్ని దానాల కన్నా విద్యాదానం ఎంతో గొప్పది. సమాజంలో మార్పు రావాలన్నా, విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉండాలన్నా అది చదువుతోనే సాధ్యమవుతుంది. 25 ఏళ్లు కష్టపడి చదివితే 75 ఏళ్లు సుఖంగా జీవించవచ్చు" అని పిలుపునిచ్చారు. గద్వాల ప్రభుత్వ బాలుర పాఠశాలలో చదివిన ఎంతోమంది విద్యార్థులు నేడు ఉన్నత స్థాయి ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలలో స్థిరపడ్డారని కొనియాడారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ సంస్థలకు దీటుగా నాణ్యమైన విద్యతో పాటు ఇంగ్లీష్ మీడియం, కంప్యూటర్ నైపుణ్యాలను అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా విని మంచి ఫలితాలు సాధించినప్పుడే గురువులకు నిజమైన సంతోషం లభిస్తుందన్నారు. చార్టెడ్ అకౌంటెంట్‌గా స్థిరపడి, తాను చదువుకున్న స్కూల్‌ను మరవకుండా ₹5 లక్షల విరాళం అందించిన సంగాల మహేశ్వర్ రెడ్డిని ఎమ్మెల్యే అభినందించారు. అలాగే పాఠశాలలోని బాత్రూమ్‌ల నిర్మాణానికి తన వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తుమ్మల జయలక్ష్మి నరసింహులు యాదవ్, కౌన్సిలర్లు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## మహిళ దారుణ హత్య

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 11(ప్రభాత ఉదయం)**



జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో ఓ మహిళ దారుణ హత్యకు గురైంది. తాగిన మైకంలో హత్య చేసియుంటాడని తెలుస్తోంది. దారుణ హత్య చేసి తానే హత్య చేసానని లొంగిపోయిన నిందితుడు ఈ దారుణానికి ఒడిగట్టారు. గద్వాల పట్టణం బీసి కాలనీలో నివసిస్తున్న శంకరమ్మ(59) తన ఇంట్లో ఉన్న సమయంలో శనివారం మధ్యాహ్నం ఆమె సమీప బంధువు అయిన మేకల రామంజి అనే వ్యక్తి ఒక్కసారిగా దాడికి తెగబడ్డాడు. తన వెంట తెచ్చుకున్న కత్తితో శంకరమ్మను తీవ్రంగా పొడవడంతో సంఘటన స్థలంలోనే మృతి చెందింది. హత్య అనంతరం నిందితుడు మేకల రామంజి నేరుగా గద్వాల పోలీస్ స్టేషన్‌కు వెళ్లి పోలీసుల ఎదుట లొంగిపోయాడు. శంకరమ్మకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కాగ మృతురాలు శంకరమ్మ, మేకల రామాంజి కుటుంబానికి గతంలో అస్థి వివాదం ఉన్నదని, ఈ క్రమంలో మద్యం మత్తులో హత్య చేసియుంటాడని స్థానికులు చర్చించుకుంటున్నారు. పోలీసులు సం ఘటన స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గద్వాల జిల్లా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మన చద్దన్నం స్టాల్‌ను ప్రారంభించిన గద్వాల ఎమ్మెల్యే

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 11 (ప్రభాత ఉదయం)**



గద్వాల పట్టణం భీంనగర్ లో ఏర్పాటు చేసిన మన చద్దనం స్టాల్ ను గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ తుమ్మల జయలక్ష్మీ నరసింహ్మలు యాదవ్ లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...రోజూ చద్దన్నం తీసుకోవడం వల్ల ఆయుష్షు పెరుగుతుంది అని పూర్వం పెద్దవాళు ప్రతిరోజూ చద్దన్నం తినడం వల్ల ఎలాంటి రోగాలు లేకుండా 100 నుంచి 120 ఏళ్లు ఆరోగ్యంగా బతికారు అని గుర్తు చేశారు. ఇప్పుడు అనేక వ్యాధులు, రోగాలతో ప్రతి ఒక్కరూ బాధపడుతున్నారు. అందుకే అమృతం లాంటి చద్దన్నం నేటి సమాజానికి మళ్లీ పరిచయం చేసి ప్రజలను ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడానికే 'మన చద్దన్నం' స్టాల్‌ను ఏర్పాటు చేయడంపై స్టాల్ యజమానులను ఎమ్మెల్యే అభినందించారు. ఆయిల్, మసాలా లేకుండా..తాజా, సహజసిద్ధమైన, నాణ్యమైన ఆహారం తీసుకోవాలనుకునే భోజన ప్రియులు, ప్రజలకు సంప్రదాయ, ఆరోగ్యకరమైన చిరుధాన్యాలతో తయారు చేసిన చద్దన్నం అల్పాహారాన్ని అందించే ఉద్దేశంతోమన చద్దన్నం స్టాల్ ను గద్వాలలో ప్రారంభించడం శుభ సూచికం అన్నారు. పొద్దున్నే చద్దన్నం తింటే బాడీ మొత్తం కూల్ కూల్ అవడమే కాకుండా బీపీ, షుగర్ నియంత్రణకు, జీర్ణక్రియకు మంచిది అని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, నిర్వాహకులు, నాయకులు పాల్గొన్నారు.

## పడకేసిన ప్రభుత్వ వైద్యం..

**గద్వాల జిల్లా ప్రభుత్వ దవాఖానలో నిలిచిపోయిన స్కానింగ్ సెంటర్ సేవలు**

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 11(ప్రభాత ఉదయం)**




పేదలకు మెరుగైన వైద్యం అందించాల్సిన జోగుళాంబ గద్వాల జిల్లా ప్రభుత్వ దవాఖానలో నిర్వహణ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. నిత్యం రోగులతో కిటకిటలాడే ప్రభుత్వ దవాఖానలో గత మూడు రోజుల నుంచి స్కానింగ్ సెంటర్ సేవలు నిలిచిపోయాయి. స్కానింగ్ సెంటర్ నిర్వహించాల్సిన రేడియాలజిస్టులు రోగులను ఈ రోజు రా రేపు రా... అని మూడు రోజుల నుండి తిప్పుతుండటంతో రోగులు నానాయాతనలు పడుతున్నారు. దానికి తోడు కరెంట్ కోతలు ఉండటంతో స్కానింగ్ సేవలు పూర్తిగా నిలిచిపోతున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన రోగులు ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది అని రోగుల కుటుంబ సభ్యులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు.

**రేడియాలజీ సేవలు అందక రోగుల తీవ్ర ఇబ్బందులు**

గద్వాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం ఉదయం విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో వైద్య సేవలు పూర్తిగా స్తంభించిపోయాయి. ఆసుపత్రిలోని 'రేడియాలజీ హబ్' లో ఉదయం నుండి కరెంట్ లేకపోవడంతో ఎక్స్-రే, స్కానింగ్ సేవలు నిలిచిపోయాయి. దీనివల్ల జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి పరీక్షల కోసం వచ్చిన రోగులు, వారి కుటుంబ సభ్యులు గంటల తరబడి వేచి ఉండి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అత్యవసర వైద్య సేవల కోసం ఆసుపత్రిలో జనరేటర్ అందుబాటులో ఉన్నప్పటికీ, అధికారులు మరియు సిబ్బంది దానిని ఆన్ చేసి స్కానింగ్ ప్రక్రియను కొనసాగించడం లేదని రోగుల బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలపై ఆసుపత్రి సూపరింటెండెంట్ దృష్టికి తీసుకెళ్లగా సమాధానం దాటవేశారు. మూడు రోజుల నుంచి స్కానింగ్ కోసం వస్తే రోజు తిప్పుతున్నారని రోగుల బందువులు ఆరోపిస్తున్నారు. చాల మంది గత్యంతరం లేక ప్రైవేటు స్కానింగ్ సెంటర్లకు వెళ్లి స్కానింగ్ లు తీసుకవస్తున్న పరిస్థితి గద్వాల జిల్లా ఆసుపత్రిలో నెలకొంది.




## వర్షాల కోసం రైతుల తపన

**నదీ జలాలతో గ్రామ దేవతలకు పూజలు**

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 11(ప్రభాత ఉదయం)**

వర్షాకాలం సీజన్ ఆరంభమై దాదాపు రెండు నెలలు కావస్తున్నా సరైనా వర్షాలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గద్వాల పట్టణ పరిధిలోని దౌదర్ పల్లి కి చెందిన రైతులు ఎద్దుల బండ్ల మీద గద్వాలలోని నది అగ్రహారం వద్ద ఉన్న కృష్ణానది వద్దకు చేరుకుని గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నదీ జలాలను బిందెలలో నింపుకొని ఎద్దుల బండ్ల మీద ఊరేగింపుగా గ్రామంలో ఉన్న గ్రామ దేవతలకు జలాభిషేకాలు చేశారు. అంతకుముందు గ్రామాల్లో కృష్ణానదీ జలాల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ... ఆ వరణ దేవున్ని వేడుకుంటూ సకాలంలో వర్షాలు కురిసి పాడి పంటలు సమృద్ధిగా ఉ ండాలని వేడుకోవడం జరిగిందన్నారు.